



# ఆకాంక్ష

తెలుగు డైలీ దినపత్రిక




ప్రచురణ : తెలంగాణ | బుధవారం 30-4- 2025 | సంపుటి :1 | సంచిక :12 | పేజీలు : 8 | వెల : 5-00

## తెలంగాణ ఆర్టీసీలో సమ్మె సైరన్

**7వ తేదీ నుండి నిరవధిక సమ్మెకు నిర్ణయం- సమ్మె పోస్టర్ ఆవిష్కరించిన కార్మిక జెఎసి**




హైదరాబాద్,ఏప్రిల్29(**ఆకాంక్ష న్యూస్**) తెలంగాణ ఆర్టీసీలో సమ్మె సైరన్ మోగింది. ఉద్యోగుల డిమాండ్లపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడంతో మే 7వ తేదీ నుండి నిరవధిక సమ్మె చేయాలని ఆర్టీసీ కార్మిక సంఘాలు నిర్ణయించాయి. ఈ సందర్భంగా సమ్మె సంబంధించిన పోస్టర్ ను ఆర్టీసీ కార్మిక జేఏసీ ఆవిష్కరించింది.

### ప్రధాని నివాసంలో మరోమారు
## అత్యున్నత సమావేశం

**హాజరైన రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్**



## బిజెపి, కాంగ్రెస్ కుమ్మక్కు రాజకీయాలు

**కాళేశ్వరంపై ఎన్డీఎస్ఏ నివేదికలో అవినీతి ప్రస్తావన లేదు**
**ఉత్తమ్ వ్యాఖ్యలను ఖండించిన మాజీమంత్రి హరీష రావు**



**హైదరాబాద్,ఏప్రిల్29 (ఆకాంక్ష న్యూస్): కాళేశ్వరంపై ఎన్డీఎస్ఏ ఇచ్చిన నివేదిక మీద నీటిపారుదల శాఖమంత్రి ఉత్తమ్ మాట్లాడినవన్నీ అబద్ధాలేనని భారాస నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. మేడిగడ్డలో అవినీతి జరిగిందని ఎన్డీఎస్ఏ ఎక్కడా చెప్పలేదన్నారు. రాష్ట్రమంతటా బీఆర్ఎస్ రజతోత్సవ సభ, కేసీఆర్ ప్రసంగంపై**

## కాళేశ్వరం అవినీతిని కప్పిపుచ్చే యత్నం

- కేంద్రం నివేదికను తప్పుపట్టడం దుర్మార్గం
- సొంత నిర్ణయాలతో లక్షకోట్లు నీటిపాటుచేశారు
- అయినా సిగ్గూఎగ్గ లేకుండా మాట్లాడితే ఎలా
- బిఆర్ఎస్ నేతల తీరుపై మండిపడ్డ మంత్రి ఉత్తమ్



# రాజకీయాల్లో నాటి విలువలు...నేడెక్కడ....?

- ఏ అంశమైన పరుష పదజాలం వాడుతున్న వైనం...
- సోషల్ మీడియా వేదికగా బూతు పురాణం....
- సోషల్ మీడియా కట్టడిలో అధికారుల చర్యలు శూన్యమేనా...





ఆకాంక్ష ప్రత్యేక ప్రతినిధి : సాంప్రదాయ రాజకీయాలకు స్వస్తి పలికి ఉద్రేక రాజకీయాల వైపు నేతల ప్రయాణం సాగుతోందన్న భావన సర్వత్రంగా వ్యక్తం అవుతుంది. ఆరోపణలకు ప్రత్యారోపణలు చేసుకునే రాజకీయ పార్టీలు మారుతున్న కాలంతో పాటుగా పార్టీలు కూడా తమ పంథాను మార్చుకున్నట్లుగా కనిపిస్తుంది. ఉద్రేక రాజకీయాలు చేస్తే రాజకీయంలో హీరోయిజంగా భావించే నేటి రాజకీయ వ్యవస్థలో నాయకులు కూడా అదే పంథాను అనుసరిస్తున్నారు. హత్యకు ప్రతి హత్య అన్న చందంగా రాజకీయాలు వ్యక్తిగతమవుతున్నాయి. ఒకప్పుడు స్వేచ్ఛ స్వతంత్రం కోసం... తెలంగాణ సాయుధ పోరాటం సాగించి అవి సాధించుకున్నాం... ఆ తర్వాత రాజకీయాల్లో ప్రతిపక్షాలు సైతం ప్రజా సమస్యల కోసం నిరసన పోరాటాలు చేశాయి. అందుకు అనుగుణంగా

మిగతా 6లో

### ఎంఎస్ఎంఈలకు
## బ్యాంకులు చేయూతనివ్వాలి


**-ముఖ్యమంత్రి చంద్రబాబు**



అమరావతి, **(ఆకాంక్ష న్యూస్)**
వచ్చే నాలుగేళ్లలో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి, సంపద సృష్టి, పేదరిక నిర్మూలన లక్ష్యంగా పెద్దఎత్తున కార్యక్రమాలు చేపడుతున్నామని, ఓవైపు స్వర్ణాంధ్ర-2047 విజన్‌కు అనుగుణంగా పనిచేస్తూనే మరోవైపు 2029 కల్లా పూర్తి చేయాల్సిన ప్రాజెక్టులు, లక్ష్యాలపై ప్రధానంగా దృష్టి పెట్టామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. దీనికి బ్యాంకులు సంపూర్ణ మద్దతివ్వాలని, 2025-26లో నిర్దేశించుకున్న క్రెడిట్ ప్లాన్ లక్ష్యాలను

- మిగతా 2లో పేజిలో

### ఉగ్రవాదం అణచివేతలో
## సైన్యానికి పూర్తి స్వేచ



- సైన్యం నిర్ణయం మేరకు ఆపరేషన్ నిర్వహణ
- భారత సైన్యం శక్తి సామర్థ్యాలపై అపార నమ్మకం
- ఉన్నతస్థాయి సమీక్షలో ప్రధాని మోడీ విస్పష్ట ప్రకటన

న్యూఢిల్లీ,ఏప్రిల్29(**ఆకాంక్ష న్యూస్**) : ఉగ్రవాదాన్ని అణిచివేసే విషయంలో సైనిక దళాలకు పూర్తి స్వేచ్ఛ ఇస్తున్నట్టు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రకటించారు. ఆపరేషన్ నిర్వహణ, సమయం, తేదీ, టార్గెట్‌లను సైన్యమే నిర్ణయిస్తుందని, భారత దళాల సామర్థ్యంపై తమకు పూర్తి విశ్వాసం ఉందని చెప్పారు. పహల్గాం దాడి అనంతర పరిణామాలు, భద్రత, సన్నద్ధతపై ప్రధానమంత్రి తన నివాసంలో మంగళవారం సాయంత్రం

- మిగతా 2లో పేజిలో



## పెగాసస్ వ్యవహారంపై సుప్రీం సంచలన వ్యాఖ్యలు

- దేశ వ్యతిరేక శక్తుల కోసం ఉపయోగిస్తే తప్పేంటని ప్రశ్న
- పహల్గాం దాడులతో పరిస్థితి ఎలా ఉందో ఊహించుకోవచ్చు
- పెగాసస్‌పై విచారణ సందర్భంగా ధర్మాసనం వెల్లడి

న్యూఢిల్లీ,ఏప్రిల్29(ఆకాంక్ష న్యూస్) దాదాపు నాలుగేళ్ల క్రితం దేశ రాజకీయాలను కుదిపేసిన పెగాసస్ వ్యవహారం పై సుప్రీం సంచలన వ్యాఖ్యలు చేసింది. దేశ వ్యతిరేక శక్తుల కోసం ఉపయోగిస్తే తప్పు లేదని ధర్మాసనం వ్యాఖ్యానించింది.

- మిగతా 2లో పేజిలో

# మిస్ వరల్డ్ పోటీలకు పటిష్ట ఏర్పాట్లు

(మొదటి పేజి (తరువాయి)



ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో భాగంగా ఉన్నతాధికారులకు ఆయన కీలక సూచనలు చేశారు. ఈ పోటీలకు వచ్చే అతిథులు .. తెలంగాణలోని చారిత్రక కట్టడాలు, పర్యాటక ప్రాంతాలను సందర్శించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు- చేయాలన్న సూచించారు. విభాగాల వారీగా ఏర్పాట్ల పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులను నియమించాలని ఉన్నతాధికారులకు సీఎం వివరించారు. అలాగే నగరంలో పెండింగ్‌లో ఉన్న బ్యూటిఫికేషన్ పనులను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈ మిస్ వరల్డ్ పోటీలు ప్రారంభమయ్యే నాటి నుంచి పూర్తయ్యే వరకు చేపట్టే కార్యక్రమాలు, ఏర్పాట్లకు సంబంధించిన పూర్తి స్థాయి ప్రణాళికను సిద్ధం చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. హైదరాబాద్ వేదికగా 72వ మిస్ వరల్డ్ పోటీలు జరగనున్నాయి. ఇవి మే 7వ తేదీ నుంచి జూన్ 2వ తేదీ వరకు జరగనున్నాయి. వేర్వేరు వేదికలపై వేర్వేరు థీమ్‌లతో వీటిని చేపట్టేందుకు ప్రణాళిక రూపొందించార ౦.దేశ విదేశాల నుంచి మిస్ వరల్డ్ పోటీ-ల్లో పాల్గొనేం దుకు అతిథులు మే 6, 7 తేదీల్లో హైదరాబాద్ తరలిరానున్నారు. మే 10వ తేదీన గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో మిస్ వరల్డ్ పోటీ-లు ప్రారంభమవుతున్నాయి. మే 12వ తేదీన బుద్ధభ వన్‌లో అందాల భామలతో అధ్యాత్మిక పర్యటన ఏర్పాటు- చేశారు. ఈ సందర్భంగా నాగార్జున సాగదర్, హదరాబాద్‌లలో హెరిటేజ్ వాక్‌లు ఏర్పాటు- చేశారు. ఇక మే 13వ తేదీన చౌమహల్లా ప్యాలెస్‌లో సుందరాంగులు, అతిథులకు వెలకం డిన్నర్ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది.

# ఉగ్రవాదం అణచివేతలో సైన్యానికి పూర్తి స్వేచ్ఛ

(మొదటి పేజి (తరువాయి)

కీలక సమావేశం నిర్వహించారు. సుమారు గంటన్నర సేపు ఈ సమావేశం జరిగింది.

పహల్‌గామ్‌లో ఉగ్రవాదులు దారుణ మారణహోమానికి పాల్పడి వారం రోజులు పూర్తయింది. ఈ ఘటనలో 26 మంది పర్యాటకులు మృత్యువాత పడ్డారు. ఈ దాడి తర్వాత కేంద్రం పాకిస్థాన్‌కు బుద్ధి వచ్చేలా పలు నిర్ణయాలు తీసుకుంటోంది. తాజాగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నివాసంలో ఉన్నతస్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మోదీ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. ఉగ్రవాద నిర్మూలనకు దృఢచిత్త ంతో ఉన్నమని ప్రధాని తెలిపారు. ఉగ్రవాదాన్ని అణిచివేయడం జాతీయ సంకల్పం అని ఆయన అన్నారు. సాయుధ దళాల సామర్థంపై పూర్తి విశ్వాసం ఉందని ఆయన తెలిపారు. తీవ్రవాదం అణిచివేయడంలో, అందుకు తగిన కార్యాచరణ రూపొందించుకోవడంలో సైన్యానికి పూర్తి స్వేచ్ఛ ఇస్తున్నామని పేర్కొన్నారు. ఎప్పుడు, ఎలా స్పందించాలో నిర్ణయం తీసుకొనే స్వేచ్ఛ పూర్తిగా సైన్యానిదే అని ఆయన స్పష్టం చేశారు. ప్రధాని అధ్యక్షతన ఈ సమావేశం దాదాపు గంటన్నరపాటు- కొనసాగింది. ఈ సమావేశంలో రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, సిడిఎస్ జనరల్ అనిల్ చౌహాన్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ ధోబాల్ పాటు- వివిధ దళాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఉగ్రవాదాన్ని అణచివేయాలనేదే దేశ సంకల్పమని ప్రధాని మోదీ ఉద్ఘాటించారు. చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ సహా త్రివిధ దళాల అధిపతులతో ఉన్నత స్థాయి సమావేశం సందర్భంగా ప్రధాని మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు. పహల్గాం ఉగ్రదాడి అనంతరం దేశంలో అంతర్గత భద్రత, సరిహద్దులో నెలకొన్న పరిస్థితులపై ప్రధాని మోదీ తన నివాసంలో కీలక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పాకిస్థాన్‌ను ప్రస్తావించిన ప్రధాని మోదీ.. ఉగ్రవాదులు, వారిని పెంచి పోషిస్తున్న వారిని పాతాళంలో తొక్కేస్తామని స్పష్టం చేసినట్లు- తెలుస్తోంది. అంతేకాదు, వారి ఊహకందని రీతిలో చర్యలు ఉంటాయని చెప్పినట్లు సమాచారం. పహల్గాం ఉగ్రఘటనకు ప్రతీకార దాడులు తప్పవని ఊహాగానాలు వ్యక్తమవుతున్న వేళ ప్రధాని మోదీ మాటలు వీటికి మరింత బలాన్ని చేకూరుస్తున్నాయి. మరోవైపు భద్రతారంగ కేబినెట్ కమిటీ బుధవారం సమావేశం కానుంది. వారం రోజుల వ్యవధిలో భేటీ- కానుండటం రెండోసారి. అనంతరం మోదీ నేతృత్వంలో రాజకీయ వ్యవహారాల కేబినెట్ కమిటీ- సమావేశం కానుందని సమాచారం. ఇందులో సీసీఎస్‌లోని ఐదుగురు సభ్యులతో పాటు- రవాణా, ఆరోగ్య, వ్యవసాయ, రైల్వే మంత్రులు ఉన్నారు.

# బిజెపి, కాంగ్రెస్ కుమ్మక్కు రాజకీయాలు




చర్చ జరుగుతోందనే అక్కసుతో ప్రజల దృష్టి మళ్లించేందుకు ప్రయత్నిస్తున్నారని దుయ్యబట్టారు. ఎన్డీఎస్ఏ ఎన్డీయే ప్రభుత్వ జేబు సంస్థగామారిందని హరీశ్‌రావు ఆక్షేపించారు. కాళేశ్వరంపై ఎన్డీఎస్ఏ నివేదికపై మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఇచ్చిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌పై హరీశ్‌రావు స్పందించారు. ఈ సందర్భంగా పలువురు నేతలతో కలిసి ఆయన తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. జాతీయ డ్యామ్ సేఫ్టీ చట్టాన్ని కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకించింది. కొడంగల్ నారాయణపేట ఎత్తిపోతలకు డీపీఆర్ ఉందా? డీపీఆర్ లేకుండానే కొడంగల్ ఎత్తిపోతల పనులు ప్రారంభించారు. పోలవరంలో డయాఫ్రమ్ వాల్ కొట్టు-కుపోతే ఎన్డీఎస్ఏ ఎందుకు మాట్లాడలేదు? పోలవరానికి ఎందుకు పోలేదు? ఎందుకు నివేదిక ఇవ్వలేదు? ఎన్డీఎస్ఏ అనేది ఎన్డీయే ప్రభుత్వ జేబు సంస్థగా మారింది. కాంగ్రెస్, భాజపా కుమ్మక్కు రాజకీయాలు చేస్తున్నాయని విమర్శించారు.

# పెగాసస్ వ్యవహారంపై సుప్రీం సంచలన వ్యాఖ్యలు

ఈ స్పైవేర్‌ను వినియోగించి దేశంలోని పాత్రికేయులు, పౌరసమాజ ప్రముఖులపై నిఘా పెట్టారన్న ఆరోపణలపై సుప్రీంకోర్టులో పలు పిటిషన్లు దాఖలయ్యాయి. దీనిపై మంగళవారం విచారణ జరిపిన అత్యున్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. జాతీయ భద్రతా ప్రయోజనాల కోసం ఓ దేశం స్పైవేర్‌ను కలిగి ఉండటం తప్పులేదని కోర్టు స్పష్టంచేసింది. అయితే,అది ఎలా,ఎవరిపై ఉపయోగిం చారన్న దాని గురించి ఆలోచించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది. పెగాసస్ ఆరోపణలపై స్వతంత్ర దర్యాప్తు జరిపించాలని కోరుతూ దాఖలైన పిటిషన్లపై జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎన్.కోటీశ్వర్ సింగ్‌తో కూడిన ధర్మాసనం మంగళవారం విచారణ జరిపింది.ఈ సందర్భంగా పహల్గాం ఉగ్రదాడి ఘటనను పరోక్షంగా ప్రస్తావిస్తూ.. ప్రస్తుతం మన దేశం ఎలాంటి పరిస్థితిలో ఉందో అందరికీ తెలుసు. మనం అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని పేర్కొంది.

## తెలంగాణ ఆర్టీసీలో సమ్మె సైరన్

(మొదటి పేజి (తరువాయి)

మే డే స్ఫూర్తితో ఆర్టిసి సమ్మెకు సిద్ధం అయ్యింది. ప్రభుత్వం స్పందించి సమస్యల నివారణకు చర్యలు చేపట్టాలని, మా న్యాయమైన డిమాండ్ ల పై స్పందించాలని జేఏసీ నాయకులూ అన్నారు. ఇక సమ్మెకు ముందు ఆర్టిసి కార్మికులు మే 5 న కార్మిక కవాతు చేపడుతున్నామని, ఆర్టీసీ కళ్యాణ మండపం నుండి బస్సు భవన్ వరకు సమ్మెకు మద్దతుగా ఆర్టీసీ యూనిఫారంలో కవాతు చేపట్టబోతున్నట్లు తెలిపారు. ఇకపోతే, కొన్ని ఆర్టీసీ కార్మికుల సంఘాలు జేఏసీలోకి వస్తామని, మళ్లీ యాజమాన్యాలకు మద్దతుగా మాతో కలవడం లేదని.. యూనియన్ లకు అతీతంగా అందరూ సమ్మెకు కలిసి రావాలని పిలుపు ఇచ్చారు. ఆర్టీసీ విలీనాన్ని సీఎం చేపట్టాలని, ప్రజాపాలన చేయాలని కోరుతున్నట్లు- వారు పేర్కొన్నారు. ప్రైవేటీకరణ మూలమైన ఎలక్ట్రిక్ బస్సు లను ఆర్టీసీ యాజమాన్యం కొని నడపాలని, 2021 వేతన సవరణ చేపట్టాలని వారు కోరారు. అలాగే ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా ఆర్టిసి కార్మికులకు ఉద్యోగులకు జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేసారు. 16 వేల మంది రిటైర్ అయిన ఖాళీలను భర్తీ చేయాలని ఈ సందర్బంగా వారు డిమాండ్ చేసారు.

## కాళేశ్వరం అవినీతిని కప్పిపుచ్చే యత్నం

హైదరాబాద్,ఏప్రిల్29 కాళేశ్వరం ప్రాజెక్టులో తీవ్రమైన లోపాలు ఉన్నట్లు ఎన్‌డీఎస్‌ఏ నివేదిక ఇచ్చిన తర్వాత కూడా భారాస నేతలు సిగ్గుపడటం లేదని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి విమర్శించారు.

కావాలని ఎదురుదాడి చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించాలని చూస్తున్నారని మండిపడ్డారు. ఇంతపెద్ద కుంభకోణం జరిగి లక్షకోట్లు నీటి పాలైతే దానిమీద వారికి చీమకుట్టినట్లుగా కూడా లేదన్నారు. 'ఎన్‌డీఎస్‌ఏ ఎవరు..? వాళ్లెవరు నివేదిక ఇవ్వడానికి' అని కించపరిచేలా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఎక్కువ కమీషన్లు వస్తాయని గత ప్రభుత్వ నేతలు కాళేశ్వరం ప్రాజెక్టు చేపట్టారని ఆరోపించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన కాళేశ్వరం ప్రాజెక్టుపై ఇటీవల ఎన్‌డీఎస్‌ఏ ఇచ్చిన నివేదికపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. కమీషన్ల కోసం ప్రాజెక్టు అంచనాను భారీగా పెంచుకుంటూ పోయారని మండిపడ్డారు. రూ.80వేల కోట్లకు అనుమతులు తీసుకుంటే..ఇప్పటికే రూ.లక్ష కోట్లు దాటిపోయిందని అన్నారు. వివిధ పేర్లతో కార్పొరేషన్లు ఏర్పాటు చేసి రుణాలు తీసుకున్నారు. అధికశాతం వడ్డీకి స్వల్పకాలిక రుణాలు తీసుకున్నారు. భారాస హయాంలోనే ప్రాజెక్టు నిర్మించారు. వాళ్ల హయాంలోనే కూలిపోయింది. ఇంతకన్నా సిగ్గుచేటు మరోటి ఉండదన్నారు. బ్యారేజీ పూర్తయిన తొలి ఏడాదిలోనే లోపాలు బయటపడ్డాయి. లోపాలు ఉన్నాయని ఇంజినీర్లు చెప్పినా సరే.. పట్టించుకోకపోవడంతో నష్ట తీవ్రత పెరిగింది. మేడిగడ్డ నిర్మాణంలో లోపాలపై భారాస ఉన్నప్పుడు కూడా ప్రాథమిక నివేదిక ఇచ్చారు. బ్యారేజీ లోపలి భాగంలో నీళ్లు భూమిలోకి పోయి బ్యారేజీ వెలుపలకు వస్తున్నాయి.

# ఎంఎస్‌ఎంఈలకు బ్యాంకులు చేయూతనివ్వాలి

(మొదటి పేజి (తరువాయి)

అధిగమించేలా కృషి చేయాలని మంగళవారం సచివాలయంలో జరిగిన 231వ స్టేట్ లెవెల్ బ్యాంకర్ల కమిటీ సమావేశంలో ముఖ్యమంత్రి సూచించారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో సాధించిన ఫలితాలపై బ్యాంకింగ్ అధికారులతో చర్చించిన ముఖ్యమంత్రి, 2025-26 లక్ష్యాలను నిర్దేశించారు. నూరు శాతం లక్ష్యాలను అధిగమించి దక్షిణ భారతదేశంలోనే మేటిగా ఉన్నందుకు ముఖ్యమంత్రి బ్యాంకర్లను అభినందించారు. సమావేశంలో 2025-2026 ఆర్థిక సంవత్సరానికి 'ఏపీ యాన్యువల్ క్రెడిట్ ప్లాన్'ను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ డ్వాక్రా మహిళలు, కౌలు రైతులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల ఎదుగుదలకు ప్రత్యేకంగా ఏం చేయగలం అనేది బ్యాంకర్లు ఆలోచించాలని చెప్పారు.

ఆర్థిక మద్దతుకే ఎస్ఎల్‌బీసీ సమావేశాలు: తాను ముఖ్యమంత్రిగా ఎప్పుడున్నా తరచూ ఎస్ఎల్‌బీసీ సమావేశాలు నిర్వహించడానికి ప్రధాన కారణం రాష్ట్ర అభివృద్ధి, ప్రజల జీవన ప్రమాణాలు పెంచేందుకు బ్యాంకుల మద్దతు కూడగట్టేందుకేనని అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సేవలు, పరిశ్రమల రంగాలకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చామని, కానీ రాష్ట్ర విభజన తర్వాత ప్రాధాన్యతలు మారాయని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ రంగ ఆధారిత రాష్ట్రం కావడం, దీనిపై ఎక్కువమంది ఆధారపడి జీవిస్తుండటంతో వ్యవసాయరంగానికి అండగా నిలిచామన్నారు. వ్యవసాయ అనుబంధరంగాలను సైతం బలోపేతం చేసేలా వివిధ కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు.

బ్యాంకుల సహకారంతోనే పురోగతి : డిమాండ్‌కు తగ్గట్టుగా ఏ రంగం పురోగతి సాధించాలన్నా బ్యాంకుల మద్దతు తప్పనిసరి అని చెప్పారు. వివిధ రంగాల్లో భారీగా ప్రాజెక్టులు వస్తున్నాయని, వాటికి అవసరమైన ఆర్థిక మద్దతు ఇవ్వాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఇంటికో ఎంట్రప్రెన్యూర్ లక్ష్యంతో ప్రతి నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈలు, అలాగే రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌లు ఏర్పాటు చేస్తున్నట్టు ముఖ్యమంత్రి చెప్పారు. 2029 కల్లా పేదరికం నిర్మూలించేలా జీరోపావర్టీ-పీ4 అమలు చేసి అసమానతలు తొలిగించేలా కృషి చేస్తున్నామని తెలిపారు. సంపద సృష్టికి, మౌలిక సదుపాయాల కల్పనకు పీపీపీ విధానాన్ని రాష్ట్రంలో విస్తృతంగా అమలు చేస్తున్నామన్నారు.

# ప్రధాని నివాసంలో మరోమారు అత్యున్నత సమావేశం

న్యూఢిల్లీ,ఏప్రిల్29: జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో గతవారంలో 26 మంది టూరిస్టులను పొట్టనపెట్టుకున్న ఉగ్రదాడి నేపథ్యంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మంగళవారం సాయంత్రం తన నివాసంలో అత్యున్నత స్థాయి భద్రతా సమూవేశం నిర్వహించారు. పరిస్థితిని సమీక్షించారు. కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ అనిల్ చౌహాన్‌లు ఈ సమావేశంలో పాల్గొన్నారు. త్రివిధ దళాధి పతులు జనరల్ ఉపేంద్ర ద్వివేది (ఆర్మీ), అడ్మిరల్ దినేష్ కె త్రిపాఠి (నేవీ), అమర్ ప్రీత్ సింగ్ (ఎయిర్‌ఫోర్స్) సైతం హాజరయ్యారు.జాతీయ భద్రతాంశాలపై విధాన నిర్ణయాలు తీసుకునే కేబినెట్ భద్రతా వ్యవహారాల కమిటీ- బుధవారంనాడు కీలక సమావేశం జరుపనుంది. దీనికి ప్రధానమంత్రి అధ్యక్షత వహించనున్నారు. ఈ కీలక సమావేశానికి ముందుగానే మోదీ నివాసంలో త్రివిధ దళాధిపతులు, అజిత్ దోవల్ తదితరులు మంగళవారం సమావేశం కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. జమ్మూకశ్మీర్‌లో భద్రతా పరిస్థితిపై ప్రధానమంత్రికి సోమవారంనాడు సుమారు 40 నిమిషాల పాటు- రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రధానమంత్రికి వివరించారు.

మరోవైపు పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో తీసుకుంటు-న్న చర్యలు, భద్రతపై సమీక్షించేందుకు హోం మంత్రిత్వ శాఖకార్యాలయంలో మంగళవారం సాయంత్రం అత్యున్నత స్థాయి భద్రతా సమావేశం నిర్వహించారు. దీనికి హోం శాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ అధ్యక్షత వహించారు.

ఆకాంక్ష

బుధవారం 30 ఏప్రిల్ 2025

# సంస్థ అభివృద్దే ప్రతి ఉద్యోగి లక్ష్యం కావాలి..

● చెంగిచెర్ల ఆర్టీసీ డిపో మేనేజర్ కే. కవిత పిలుపు...

● డిపోలో ప్రగతి చక్ర అవార్డుల పురస్కారాల ప్రదానం

● అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఉత్తమ ఉద్యోగులకు అభినందన



హైదరాబాద్(ఆకాంక్ష న్యూస్) :
ఆర్టీసీ సంస్థ అభివృద్దే ప్రతి ఉద్యోగి లక్ష్యం కావాలని ఆర్టీసీ చెంగిచెర్ల డిపో మేనేజర్ కే. కవిత పిలుపునిచ్చారు. ఆర్టీసీ చెంగిచెర్ల డిపోలో ప్రగతి చక్ర అవార్డుల పురస్కారాలలో భాగంగా అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఉత్తమ ఉద్యోగులకు అభినందన సభ మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా అత్యధిక ఆదాయం తీసుకువచ్చిన కండక్టర్లు, ఇందనం ఆదాచేసిన డ్రైవర్లు, బస్సులను సక్రమంగా మెయింటెనెన్స్ చేసిన మెకానిక్ లను శాలువాలతో సన్మానించి నగదు బహుమతులు, ప్రశంస పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ కవిత మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి అంకితభావంతో పనిచేసినప్పుడే ఆదాయం పెంచుకోగలుగుతామన్నారు. డ్రైవర్లు రోడ్డు ప్రమాదాలను నివారించి సంస్థకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ప్రయాణికులను ఆదరించి వారి మన్నలను పొందడం ద్వారా ఆదాయాన్ని మరింత పెంచుకోవచ్చని సూచించారు. సమయ పాలనకు పాటించి ప్రయాణికుల మన్ననలు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ (ట్రాఫిక్) చంద్రమౌళి, అసిస్టెంట్ మేనేజర్ (పర్సనల్) శేషి రెడ్డి, ఈడబ్ల్యుబి సభ్యులు పద్మావతి, వెంకటేష్, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## భూముల హక్కులను కాపాడేందుకు గ్రామీణ రెవిన్యూ వ్యవస్థను బలోపేతం చేస్తాం...

రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్...




చిగురుమామిడి (ఆకాంక్ష న్యూస్) :
భూముల హక్కులను కాపాడేందుకు గ్రామీణ రెవిన్యూ వ్యవస్థను బలోపేతం చేస్తామని రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఈ సందర్భంగా కరీంనగర్ జిల్లా చిగురు మామిడి మండల కేంద్రంలోని మహాలక్ష్మి ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన భూభారతి అవగాహన సదస్సు కార్యక్రమానికి మంత్రి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికలో అత్యంత నిరుపేదలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని దఫ దఫాలుగా నీరు పేదలందరికీ ఈ పథకం వర్తింపచేయాలని అధికారులకు సూచించినట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. తెలంగాణలో రైతులకు చెందిన ప్రతి భూ సమస్య పరిష్కారం అవుతుందని ప్రభుత్వ ఆస్తులు ప్రభుత్వ అవసరాలను మాత్రమే వినియోగించాలని తెలిపారు. ఎవరైనా భూ కబ్జాలకు పాల్పడి ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని తిరిగి భూములను ప్రజా అవసరాలకు వినియోగిస్తామన్నారు. ఎలాంటి భూ సమస్యలు ఉండకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం భూభారతి నూతన రెవిన్యూ చట్టాన్ని అమలులోకి తెచ్చిందని మంత్రి తెలిపారు. జూన్ రెండో తేదీ నుండి ఈ చట్టం ద్వారా సమస్యలు పరిష్కారం అవుతాయని తెలిపారు.

## వేదనలోనూ వీడని వితరణ...

## కుమారుని స్మృతిలో అన్నదానం చేసిన కుటుంబం



గోదావరిఖని (ఆకాంక్ష న్యూస్) :
ఇటీవల రోడ్డు ప్రమాదంలో అసువులుబాసిన సిరిపురం వంశీ జయంతి సందర్భంగా తల్లి తండ్రులు సిరిపురం శ్రీనివాస్-మమత దంపతులు మంగళవారం స్థానిక అమ్మ పరివార్ ఆశ్రమంలో అన్నదాన కార్యకమాన్ని నిర్వహించారు. వంశీ చిత్రపటానికి నివాళులర్పించి కేక్ కట్ చేసి పిల్లలకు పంచారు. గోదావరి కళా సంఘాల సమాఖ్య ఆఫీస్ బాయ్, నిరుపేద యువకుడు సంపత్ కు వంశీ జ్ఞాపకార్థం కొత్త బట్టలు పెట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రయోజకుడై చేతికి అంది వచ్చిన చెట్టంత కొడుకును ప్రమాదరూపంలో కోల్పోవడం మనసును కలచివేస్తోందని, ఆ పుట్టెడు దుఃఖంలోనూ సమాజహితం కోసం కుమారుడి జ్ఞాపకాల్లో నిరుపేదలకు అన్నదాన వితరణ చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు బుచ్చమ్మ, సూర్య, పద్మ, కుమారస్వామి, సరస్వతి, కార్తీక్, బిట్టు, సాన్యా, కళాకారులు కనకం రమణయ్య, మేజిక్ రాజా, మాదరి వాసు, సోగాల వెంకటి, కాశిపాక రాజమౌళి, బోడకుంట వెంకట్రాజం, చంద్రపాల్, అట్ల జగ్గయ్య, డాక్టర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ డ్రైవర్? ఆత్మహత్యాయత్నం

బాన్సువాడ(ఆకాంక్ష న్యూస్) :
ఆర్టీసీ డ్రైవర్? ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన బాన్సువాడ పట్టణంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే... పట్టణంలోని ఆర్టీసీ డిపోలో విధులు నిర్వహిస్తున్న డ్రైవర్? గంగాధర్? మంగళవారం గడ్డిమందు తాగాడు. అనంతరం డిపోకు చేరుకుని తనకు న్యాయం చేయాలని తోటి సిబ్బందితో మాట్లాడాడు. వెంటనే వారు అతడిని బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఆరోగ్యం బాగా లేకపోవడంతో నాలుగు రోజులుగా తాను సెలవులో ఉన్నానని గంగాధర్? తెలిపారు. అయినప్పటికీ ఆరోగ్యం కుదుట పడకపోగా సెలవుల విషయంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారనే మనస్థాపంతో గడ్డిమందు తాగినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

## ఇండియన్ ప్రజా కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గా నాదెండ్ల సుధాకర్



హైదరాబాద్(ఆకాంక్ష న్యూస్) :
ఇండియన్ ప్రజా కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గా నాదెండ్ల సుధాకర్ నియామితులైనారు. ఈ మేరకు ఇండియన్ ప్రజా కాంగ్రెస్(ఐ పి సి ) జాతీయ అధ్యక్షులు కేబీ శ్రీధర్ తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గా నాదెండ్ల సుధాకర్ ను నియమిస్తు ఉత్తర్వులు జారీ చేశారు. మంగళవారం పార్టీ రాష్ట్ర కార్యాలయం లో ఐ పి సి పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ పుష్పాంజలి చేతుల మీదుగా నాదెండ్ల సుధాకర్ నియామక పత్రాన్ని అందుకున్నారు ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ ఐపిసి పార్టీని మాత్రు ప్రేమతో ప్రజాక్షేత్రంలోకి తీసుకెళ్తానని అలాగే పార్టీని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడానికి తన వంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ అడ్వైజర్ చిత్ర, జాతీయ కోఆర్డినేటర్ సెల్వ రాజు, తెలంగాణ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు డాక్టర్ ఆకారపు పద్మిని దేవి, ఐపీసీ పార్టీ ఇన్చార్జి నంది కొండలరావు, , యాదాద్రి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎడవల్లి సరిత పిఆర్ఓ వెంకటేశం తదితరులు పాల్గొన్నారు

## ఘనంగా సామ జగన్ మోహన్ రెడ్డి వర్ధంతి



హైదరాబాద్(ఆకాంక్ష న్యూస్) :అఖిల భారతీయ విద్యార్థి పరిషత్-సికింద్రాబాద్ జిల్లా, మారేడుపల్లి శాఖ ఆధ్వర్యంలో జాతీయ జెండాకోసం నరహంతక నక్సలైట్ల చేతిలో అమరుడైన సామ జగన్ మోహన్ రెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి సికింద్రాబాద్ జిల్లా కన్వీనర్ చెర్కబాలు ముఖ్య అతిధిగా హాజరైనారు. ఈ సందర్భంగా బాలు మాట్లాడుతూ 29 ఏప్రిల్ 1982 నక్సలైట్ల అరాచకం కాకతీయ విశ్వవిద్యాలయం లో కూడా పాకింది అందులో ఉన్న చాలా మంది విద్యార్థినీ విద్యార్థులను నక్సల్ వైపు తిప్పడానికి చాలా ప్రయత్నాలు జరిగాయన్నారు. ఒక రోజు జనవరి 26 నాడు జాతీయ జెండా కు బదులుగా నల్ల జెండా ఎగరవేయడం జరిగింది అక్కడే ఉన్న చాలా మంది విద్యార్థులు ప్రొఫెసర్లు ఎవరు నోరు మెదపలేదు. ఆ అరాచకం చూడలేని సామ జగన్మోహన్ రెడ్డి ముందుకు వచ్చి వాళ్లతో పోరాటం చేసి జాతీయ జెండా ఎగురవేసిన ఘనత సామా జగన్మోహన్ అన్నదే నాన్నారు. దాన్ని సహించలేని నక్సల్స్ సామా జగన్మోహన్ రెడ్డి అన్న ను చాలా రకాలుగా బెదిరింపులు చాలా ఇబందులకి గురి చేశారు సామా జగన్ మోహన్ అన్న ఆ బెదిరింపులకు బెదరకుండా ముందుకు వెళ్లి వాళ్ల పై చర్య తీసుకోవాలని కోర్టులో కేసు వేయడం జరిగింది కోర్టులో కేస్ గెలుచుకొని వస్తున్న క్రమంలో హనుమకొండ అంబేద్కర్ చౌక్ దగ్గర సామా జగన్మోహన్ రెడ్డిని కిరాతకంగా 35 కత్తి పోట్లతో చంపడం జరిగింది. నేటి విద్యార్థులు కూడా సామా జగనన్న గారిని స్ఫూర్తిదాయకంగా తీసుకొని దేశం పట్ల చిత్తశుద్ధితో అడుగులు వేయాలని చెప్పి వారు విద్యార్థులకు సందేశం ఇచ్చారు ఈ కార్యక్రమం లో మారేడుపల్లి టౌన్ సెక్రటరీ ప్రణయ్ కుమార్, కాలేజ్ సెక్రెటరీ చందన్ కుమార్,సుశాంత్,సాయి,నిఖిల్ మరియు ఇతరులు పాల్గొన్నారు..

## కరాటే విద్యార్థులకు గ్రేడింగ్ టెస్ట్



మంథని (ఆకాంక్ష) :
మంథని పట్టణంలోని ఎస్ఎల్ బి ఫంక్షన్ హాల్ లో ఇన్ స్ట్రక్టర్ కో%శీ%ద్ర నాగరాజు ఆధ్వర్యంలో 43 విద్యార్థులకు గ్రేడింగ్ టెస్ట్ నిర్వహించారు. టెస్టులో అత్యధిక ప్రతిభ కనబరచిన విద్యార్థులకు 12 జూనియర్ రెడ్, 10 ఎల్లో బెల్ట్, 07 ఆరెంజ్ బెల్ట్స్ , 6 గ్రీన్ బెల్ట్, 2 బ్లూ బెల్ట్, 2 పర్పుల్ బెల్ట్, 4 బ్రౌన్ బెల్టులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ గ్రేడింగ్ టెస్టుకు షాటోఖాన్ కరాటే రాష్ట్ర ఉపాధ్యక్షుడు నూకల బానయ్య, జె కె ఏ సౌత్ ఇండియా ఇంచార్జి రాపోలు సుదర్శన్ లు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడుతూ మహిళలు ప్రత్యేకంగ కరాటే ఆత్మరక్షణకు ఉపయోగపడుతుందన్నారు. కరాటేతో క్రమశిక్షణ, శరీర దృఢత్వం, ఆత్మ రక్షణకు దోహదపడుతుందన్నారు.

## ఎటువంటి అనుమతులు లేకుండా డుస్తున్న జ్యోతి క్లినిక్ సీజ్....

జగిత్యాల జిల్లా వైద్యాధికారి ప్రమోద్ కుమార్




జగిత్యాల జిల్లా(ఆకాంక్ష న్యూస్) :ఎటువంటి అనుమతులు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న జ్యోతి క్లినిక్‌ను జగిత్యాల జిల్లా వైద్యాధికారి ప్రమోద్ కుమార్ సీజ్ చేశారు. వైద్యాధికా రులతో కలిసి మెట్‌పల్లి పట్టణంలోని పలు క్లినిక్‌లలో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. అనర్హులైన వైద్యులతో రోగులకు చికిత్స అందిస్తున్నట్లు గుర్తించి క్లినిక్‌ను మూసివేయించారు. ఈ సందర్భంగా ఎలాంటి అనుమతులు లేకుండా నిర్వహిస్తున్నారని, క్లినిక్ నిర్వాహకులను స్థానిక పోలీసులకు అప్పగించారు. ప్రజలు అర్హులైన వైద్యుల ద్వారా చికిత్స చేయించుకోవాలని అనుమతులు లేకుండా వైద్య పరీక్షలు చేసినా, చికిత్సను అందించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ ఆకుల శ్రీనివాస్, మండల వైద్యాధికారి డాక్టర్ ఎల్లాల అంజిత్ రెడ్డి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నేడు తెలంగాణలో పదో తరగతి ఫలితాలు విడుదల

నేడు తెలంగాణలో పదో తరగతి ఫలితాలు విడుదల కానున్నాయి. ఉదయం 11 గంటలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి టెన్త్ ఫలితాలను విడుదల చేసే అవకాశం ఉంది. ఈసారి మెమోలో విద్యార్థుల మార్కులు, సబ్జెక్టుల వారీగా గ్రేడ్‌లు ఇవ్వనున్నారు. కాగా, మార్చి 21 నుంచి ఏప్రిల్ 4 వరకు పదో తరగతి పరీక్షలు జరిగిన సంగతి తెలిసిందే. ఈ పరీక్షలకు మొత్తం 5 లక్షల మంది విద్యార్థులు హాజరయ్యారు.

ఆకాంక్ష

బుధవారం 30 ఏప్రిల్ 2025

## పేద విద్యార్థికి వెస్సో ట్రస్ట్ లాప్టాప్ బహూకరణ



హైదరాబాద్(ఆకాంక్ష న్యూస్) :గుంటూరు జిల్లా నందిపాడు కు చెందిన జానా సత్యనారాయణ టైలరింగ్ చేస్తూ తన కుటుంబాన్ని పోషించుకుంటూరు. ఆయన ఇద్దరు కొడుకులలో పెద్ద కొడుకు ప్రశాంత్ ఇంజనీరింగ్ రెండవ సంవత్సరం (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రత్యేక విషయం గా) గుంటూరు చలపతి ఇంజనీరింగ్ కాలేజీలో చదువుతున్నాడు. ప్రశాంత్ చదువుకు లాప్టాప్ చాలా అవసరం, కానీ లాప్టాప్ కొనుక్కునే ఆర్థిక స్తోమత అతనికి లేదు. కొద్దిరోజుల క్రితం హైదరాబాద్ కు చెందిన ఎస్బిఐ విశ్రాంత అసిస్టెంట్ జనరల్ మేనేజర్ మరియు సామాజిక సేవకులు డాక్టర్ అమ్మనబోలు పూర్ణచంద్రరావు బాపట్ల జిల్లా మార్టూరులోని అమ్మ ఆశ్రమం సందర్శించినప్పుడు సత్యనారాయణ ఇందిర దంపతులు వారికి తమ ఆర్థిక సమస్య తెలియజేసి తమ కుమారుడు ప్రశాంత్ కు లాప్టాప్ డొనేట్ చేయమని కోరారు. పర్యవసానంగాహైదరాబాద్ మధుర నగర్ శ్రీ సాయి రామకృష్ణంరాజు కమ్యూనిటీ హాల్ వద్ద ఈరోజు జరిగిన సేవా కార్యక్రమంలో డాక్టర్ పూర్ణచంద్ర రావు విద్యార్థి ప్రశాంత్ తల్లి ఇందిర కు లాప్టాప్ బహుమతిగా అందజేశారు. ఈ కార్యక్రమానికి వెస్సో ట్రస్ట్ సంస్థాపక అధ్యక్షులు బంగారు తాతారావు, ఎస్బిఐ విశ్రాంత ఉద్యోగి విజయసింహ సుశీల దంపతులు ప్రత్యేక అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వెస్సో ట్రస్ట్ అధ్యక్షులు బంగారు తాతారావు మాట్లాడుతూ డాక్టర్ పూర్ణచంద్ర రావు సంఘీయుల మీద అభిమానంతో వారి సంక్షేమానికి, అభివృద్ధికి ప్రత్యక్షంగాను, పరోక్షంగాను ఎన్నో సేవా కార్యక్రమాలలో పాల్గొంటున్నారని, ముఖ్యంగా వెస్సో ట్రస్ట్, విశ్వకర్మ ఫౌండేషన్ అండ్ సేవా ట్రస్ట్, విశ్వంలో విలీనం సేవా ట్రస్ట్ వంటి సేవా సంస్థలకు తమ విరాళాలను అందజేస్తూ పలు విధమైన సేవా కార్యక్రమాలకు అండగా ఉంటున్నారని, వారికి ఈ సందర్భంగా సంఘీయుల తరపున ధన్యవాదములు తెలిపారు.

## అపోహలు వీడండి.. నేత్రదానం చేయండి..!

- నేత్రదాత సంపత్ కుటుంబం ఆదర్శం
- నేత్రదాత కుటుంబానికి అభినందన పత్రం
- అవగాహన కల్పించిన మాజీ జెడ్పీటీసీ వెంకటరమణ రెడ్డి



పెద్దపల్లి(ఆకాంక్ష న్యూస్) : పెద్దపల్లి జిల్లా రత్నాపూర్ మండలం బేగంపేట గ్రామానికి చెందిన చిప్ప సంపత్, ఇటీవల గుండె పోటుతో మృతిచెందగా, ఆయన నేత్రాలను కుటుంబ సభ్యులు ఎల్ వి ప్రసాద్ ఐ బ్యాంకుకు, సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దానం చేశారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని గ్రామంలో మంగళవారం నేత్రదాత సంపత్ సంస్మరణ సభను నిర్వహించారు. ఉపాధి కోసం కుటుంబంతో హైదరాబాద్ కు వెళ్లిన సంపత్ గుండె పోటుతో మృతి చెందడం బాధాకరమని, ఇంటి పెద్ద దిక్కును కోల్పోయిన విషాదంలో కూడా భార్య సంధ్య, కూతురు లక్ష్మీ ప్రసన్న, సోదరి రాజమణి, బావ కనకరాజు స్పందించి మరో ఇద్దరు అందులకు చూపులు ప్రసాదించడానికి, సంపత్ నేత్రాలను దానం చేయడం అభినందనీయమని కల్వచర్ల కు చెందిన మాజీ జెడ్పీటీసీ వెంకటరమణ రెడ్డి, సదాశయ ఫౌండేషన్ ముఖ్య సలహాదారులు నూక రమేష్, రాష్ట్ర ప్రచార కార్యదర్శి కే.ఎస్.వాసు కొనియాడారు. నేత్రదానంపై అపోహలు, అనుమానాలు వీడి ప్రతి ఒక్కరు మరణానంతరం నిద్రదానం చేయడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అనంతరం సదాశయ ఫౌండేషన్, రామగుండం లయన్స్ క్లబ్ సంయుక్తంగా అందించిన అభినందన పత్రాన్ని అతిథుల చేతుల మీదుగా నేత్రదాత కుటుంబానికి అందజేసి వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో పలు సంఘాల బాధ్యులు మాటేటి శ్రీనివాస్, సత్తన్న, బంధువులు సారయ్య, వెంకటరమణ దంపతులు తదితరులు పాల్గొన్నారు.

## పహల్గంలో ఉగ్రవాదుల దాడిని ఖండించిన సీనియర్ సిటిజన్ సభ్యులు



గోదావరిఖనిటౌన్ (ఆకాంక్ష న్యూస్) :పహల్గంలో ఉగ్రవాదులు హిందువులపై కాల్పులు జరిపి 27 మందిని చంపడాన్ని గోదావరిఖని సీనియర్ సిటిజన్ సభ్యులు తీవ్రంగా ఖండించారు. గోదావరిఖని ప్రెస్ క్లబ్ లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సీనియర్ సిటిజన్ అసోసియేషన్ అధ్యక్షులు పీటీ స్వామి మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ కాశ్మీర్ లో ప్రశాంతమైన వాతావరణాన్ని తీసుకువచ్చారని అలాంటి చోట పాకిస్తాన్ ఉగ్రవాదులు అశాంతిని రేకెత్తించేలా హిందువులపై కాల్పులు జరిపి 27 మందిని పొట్టన పెట్టుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పాకిస్థాన్ ఉగ్రవాదులను పెంచి పోషిస్తుందని, పాకిస్థాన్ చర్యలను ప్రతిఘటించడానికి భారతదేశ ప్రజలంతా ప్రధాని నరేంద్ర మోడీ వెంట నడవాలని కోరారు. ఉగ్రవాదులకు అండగా నిలుస్తున్న పాకిస్థాన్ పై ప్రధాని మోడీ యుద్ధం ప్రకటించకుండా తెలివిగా అంతకంటే విలువైన పాకిస్తాన్ కు వెళ్ళే సింధూ జలాలను ఆపారని తెలిపారు. ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్తాన్ ఉగ్రవాదులను భారతదేశానికి అప్పగించి, భారతదేశ ప్రజలను క్షమాపణలు కోరాలని డిమాండ్ చేశారు. ఈ మీడియా సమావేశంలో సీనియర్ సిటిజన్ సభ్యులు గంట సత్తయ్య, సుంక లక్ష్మీనారాయణ, జాక సత్యనారాయణ, రాంచందర్ రావు,జైహింద్, ఆగమ రెడ్డి, రఘుపతి, ప్రకాష్ రెడ్డి,నారాయణ రెడ్డి, వేపూరి రాములు, ఎల్లాగౌడ్, నాగరాజు, కోట కనకయ్య, రమణ బాబు, కోటగిరి వాసు, బట్టల వెంకటి, చంద్రమౌళి, మెతుకు లచ్చన్న, అబ్బ రాజిరెడ్డి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ కార్యాలయమా... లేక ప్రైవేట్ ఆస్పత్రినా....

- రాజకీయ చదరంగంలో రామగుండం ఐఎంఏ...
- తనిఖీలు చేస్తే... కేసులు నమోదు చేస్తారా....
- జిల్లా డీఎం అండ్ హెచ్ఓపై హేయంగా ప్రవర్తించడం సరికాదు
- గోదావరిఖని మాదిగ లాయర్స్ ఫెడరేషన్ సభ్యులు...




గోదావరిఖని (ఆకాంక్ష న్యూస్) :
అది కాంగ్రెస్ పార్టీ కార్యాలయమా... లేక ప్రైవేట్ ఆస్పత్రినా అని, రాజకీయ చేత రంగంలో రామగుండం ఐఎంఏ నాయకులు ఉన్నారని గోదావరిఖని మాదిగ లాయర్స్ ఫెడరేషన్ సభ్యులు విమర్శించారు. ఈ సందర్భంగా గోదావరిఖని ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎంఎల్ఎఫ్ అద్యక్షులు జూపాక వెంకటేశ్వర్లు మాట్లాడుతూ....గోదావరిఖనిలోని శ్రీ మమత ప్రైవేట్ హాస్పిటల్ లో ఎలాంటి పర్మిషన్ లేకుండా నడుస్తున్న స్కానింగ్ మిషన్ ను చెక్ చేయడానికి వచ్చిన జిల్లా డీఎం అండ్ హెచ్ఓ అన్న ప్రసన్న పై హాస్పటల్ నిర్వాహకులు హేయంగా ప్రవర్తించడాన్ని గోదావరిఖని మాదిగ లాయర్స్ ఫెడరేషన్ సభ్యులు తీవ్రంగా ఖండించారు. మమత హాస్పిటల్ లో పర్మిషన్ లేకుండా స్కానింగ్ మిషన్ ను నడిపడమే కాకుండా చట్ట వ్యతిరేకమైన లింగ నిర్ధారణ చేస్తున్నారని సమాచారం మేరకు ఒక అధికారిగా హాస్పిటల్ చెకింగ్ కు వచ్చిన డీఎం అండ్ హెచ్ఓపై హాస్పటల్ సిబ్బంది, నిర్వాహకులు దురుగుగా ప్రవర్తిస్తూ స్కానింగ్ రూమ్ ను చూపించకుండా, రూమ్ తాళాలు లేవంటూ దళిత అధికారిని ఇబ్బందులకు గురిచేశారని తెలిపారు. ఆ అధికారిని నాలుగు గంటల పాటు ముప్పుతిప్పలు పెట్టిన తన డ్యూటీని సక్రమంగా నిరహించి పర్మిషన్ లేకుండా ఉన్న స్కానింగ్ మిషన్ బయటకు తీయడం జరిగిందన్నారు. సమాజంలో మహిళల సంఖ్య తగ్గుతున్న తరుణంలో లింగ నిర్ధారణ చేయొద్దని చట్టం ఉన్నా కూడా చట్ట వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న వారిపై చర్యలకు ఆ అధికారి ఉపక్రమిస్తే అధినందించాల్సింది పోయి తిరిగి ఆ అధికారిపైనే రిటర్న్ కేసు దాఖలు చేశారని దానికి ఇక్కడి ఐఎంఏ సభ్యులు, రాజకీయ నాయకులు సపోర్టుగా నిలిచారని ఆరోపించారు. ఈ విషయంలో రామగుండం ఎమ్మెల్యే కూడా స్పందించి దళిత అధికారిపై దాడికి ఉపక్రమించిన వారిపై చర్యలు తీసుకునే ఆదేశించాలని డిమాండ్ చేశారు. నిజాయితీగా వ్యవహరించే అధికారులకు అందరూ అండగా నిలవాలని కోరారు. ఈ మీడియా సమావేశంలో మాదిగ లాయర్స్ ఫెడరేషన్ ప్రధానకార్యదర్శి ఎరుక మనోహర్, పులిపాక ప్రవీణ్, ఇరుగురాళ్ళ సంతోష్, గాజుల రాజ్ కుమార్, కాదాసి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్...

కాంగ్రెస్ పార్టీని తెలంగాణ ప్రాంత విలన్ అనడం సరికాదు

కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు తిప్పారపు శ్రీనివాస్, గట్ల రమేష్



గోదావరిఖనిటౌన్ (ఆకాంక్ష న్యూస్) :
మిగులు బడ్జెట్ తో ఉన్న తెలంగాణ రాష్ట్రాన్ని... మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అప్పుల కుప్పగా మార్చారని బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభలో కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన కాంగ్రెస్ పార్టీని తెలంగాణ ప్రాంత విలన్ అంటూ సంబోధించడాన్ని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు తిప్పారపు శ్రీనివాస్, గట్ల రమేష్ తీవ్రంగా ఖండించారు. గోదావరిఖని ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ...కేసీఆర్ కు కాంగ్రెస్ పార్టీని విమర్శించే నైతిక హక్కులేదని అన్నారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్రాన్ని ఇవ్వకుంటే కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యేవాడా ఒక్కసారి ఆలోచించుకోవాలని కోరారు. తెలంగాణ రాష్ట్రానికి దళితున్ని ముఖ్యమంత్రి చేస్తానని, దళితులకు మూడు ఎకరాల భూమి ఇస్తానని, ఇంటికో ఉద్యోగం ఇస్తామని పచ్చి అబద్ధాలు చెప్పించి కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీ అని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలకు బస్సు ఫ్రీ చేసిందని,ప్రతి ఇంటికి 200 యూనిట్ల విద్యుత్ ఫ్రీ చేసిందని, 500 రూపాయలకే గ్యాస్ బండ ఇస్తుందని, రైతుకు రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేసిందని తెలిపారు. ప్రజలకు ఇంత చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బదునాం చేయడానికే బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభను పెట్టినట్లు ఉందని అన్నారు. రజతోత్సవ సభలో కేసీఆర్ మాటలు వింటే అధికారం కోల్పోతామన్న బాధ, అధికారంలో ఉన్న రేవంత్ రెడ్డిని ఎలా గద్దె దింపాలి, మళ్ళీ అధికారంలో ఎలా రావాలన్నా తపనే కానవచ్చిందని ఎద్దేవా చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏమి ఆగం కాలేదని ఒక కేసీఆర్, కేసీఆర్ కుటుంబం మాత్రమే ఆగమైందని అన్నారు. కేసీఆర్ ఎంత మొత్తుకున్నా అధికారంలోకి రావడం కల అని, ప్రజా పాలన వైపే ప్రజలంతా ఉన్నారని తెలిపారు. ఈ మీడియా సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు విజయ్, కళ్యాణి సింహాచలం, కౌటం సతీష్, మాలెం మధు, కొమ్ము వేణు, దొంతు శ్రీనివాస్,అల్లి శంకర్, నజిమొద్దీన్, ఎండీ. గఫూర్ తదితరులు పాల్గొన్నారు.

### శ్రీ మమత హాస్పిటల్ యజమాన్యంపై

## చర్యలు తీసుకోవాలి...

కలెక్టర్ కు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఐక్య కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో వినతి పత్రం



కరీంనగర్ (ఆకాంక్ష న్యూస్) :
పెద్దపల్లి జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి విధులకు ఆటంకం కలిగించి భయభ్రాంతులకు గురిచేసి,వారి పైన రిసిప్షనిస్ట్ ఆనంద్ చే కేసు నమోదు చేయించిన గోదావరిఖని శ్రీ మమత హాస్పిటల్ యజమాన్యం,సిబ్బంది తదితరులపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఐక్య కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో జిల్లా టి ఎన్ జి ఓ అధ్యక్షులు బొంకూరి శంకర్, వైద్య ఉద్యోగులు వినతి పత్రాన్ని అందించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ నెల 26 వ తేదీన డా. జి. అన్నా ప్రసన్న కుమారి, పెద్దపల్లి జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి విధి నిర్వహణలో బాగంగా గోదావరిఖని లోని శ్రీ మమత హాస్పిటల్ కు తనిఖీ చేయగా అందులో అనుమతి లేని అల్ట్రాసౌండ్ స్కానింగ్ మిషన్ ను గుర్తించడం జరిగిందన్నారు. చట్ట ప్రకారం ప్రభుత్వ అనుమతి లేకుండా స్కానింగ్ మిషన్ కలిగి ఉండడం నేరమని తన విధి నిర్వహణ ప్రకారం చర్యలు తీసుకుంటుండగా దానికి అడ్డుపడి, నానా విధాలుగా బెదిరించి ఐఎంఏ డాక్టర్లు ఇతర వ్యక్తులను పిలిపించి విధులకు ఆటంకం కలిగించాలని పేర్కొన్నారు. అలాగే జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి పై దౌర్జన్యం చేసి, భయభ్రాంతులకు గురి చేయడం జరిగిందన్నారు. అంతేకాకుండా వైద్యాధికారిని చంపి వేస్తామని బెదిరించారని వినతి పత్రంలో పేర్కొన్నారు. కావున వారి పైన చట్ట రీత్యా తగు చర్యలు తీసుకోవాలని ఆసుపత్రి యాజమాన్యమైన ప్రభుత్వ డాక్టర్ నాగిరెడ్డి అందులో భాగసౌమ్యులైన కన్సల్టెంట్ గా పనిచేస్తున్న ప్రభుత్వ డాక్టర్ రాజశేఖర్ రెడ్డి, ప్రభుత్వ డాక్టర్ ఆర్.జె. స్వాతి లను వెంటనే సస్పెండ్ చేయాలని కోరారు. అలాగే ఈ దౌర్జన్యములో పాల్గొన్న డా. బి. అనిల్ కుమార్ పైన తగు చర్యలు తీసుకుంటూ మెడికల్ కౌన్సిల్ రిజిస్ట్రేషన్ ను రద్దు చేయడానికి మెడికల్ కౌన్సిల్ బోర్డు కు సిఫారసు చేయాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈ దౌర్జన్యములో పాల్గొన్న మహంకాళి స్వామి, అతని అనుచరులు హాస్పిటల్ యజమాన్యం, రిసెప్షనిస్ట్ ఆనంద్ పైన చర్యలు తీసుకోవాలని, అక్రమ కేసు బనాయించిన ఆనంద్ కేసు ఉపసంహరించుకోవలసినదిగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు డాక్టర్ వాణిశ్రీ, డాక్టర్ బి .శ్రీరాములు, డాక్టర్ బి.కిరణ్ కుమార్, వీరగోని శ్రీనివాస్ టి ఎన్ జి ఓ హెల్త్ ఫోరం అధ్యక్షులు, ఉమమహేశ్వర్, టి. జి. ఓ. హెల్త్ ఫోరం అధ్యక్షులు, దేవీ సింగ్, రాష్ట్ర పారా మెడికల్ ఆఫీసర్ ల ఫోరం అధ్యక్షులు, ఆర్ బి ఎస్ కె డాక్టర్లు, కె రమేష్, టి రాజేష్, సాలమ్మ, దాయా మని, ఎన్ హెచ్ ఎమ్ సిబ్బంది మరియు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆకాంక్ష

బుధవారం 30 ఏప్రిల్ 2025

### తెలంగాణకు ఎప్పటికి

# కాంగ్రెస్ పార్టీనే విలన్

**- ఎంత ధాన్యం కొన్నారో లెక్కలు చెప్పండి**

**-బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి విమర్శలు**



సూర్యాపేట,ఏప్రిల్29 తెలంగాణకు ఎప్పటికి కాంగ్రెస్ పార్టీనే విలన్ అని బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ పేరు విలన్ గానే తెలంగాణ చరిత్రలో నిలిచిపోతుంది.. 16 నెలల్లో సమైక్య రాష్ట్రంలో ఉన్న పరిస్థితులు వచ్చాయని ఆరోపించారు. ఒక్క ఏడాదిలోనే గురుకుల పాఠశాలల్లో 90 మంది విద్యార్థులు చనిపోయారు అని చెప్పుకొచ్చారు. ఇక, ఉత్తమ్ కుమార్ రెడ్డి ఉత్తర కుమార ప్రగల్భాలు ఆపాలని సూచించారు. ఈ రోజు వరకు ఎంత ధాన్యం కొన్నారో ఉత్తమ్ కుమార్ లెక్క చెప్పాలి అని డిమాండ్ చేశారు. ఎన్ని వడ్లు కొన్నారు?.. ఎంత బోనస్ ఇచ్చారో చెప్పాలన్నారు. చెప్పకపోతే మీరు రండలు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ మీద ఎందుకు ఏడుస్తున్నారు.. కేసీఆర్ మీకు సంవత్సరం పైనే సమయం ఇచ్చారని జగదీష్ రెడ్డి తెలిపారు. ఎల్కతుర్తిలో జరిగిన బీఆర్ఎస్ బహిరంగ సభపై ప్రజల్లో చర్చ జరుగుతోంది అని మాజీ మంత్రి జగదీష్ రెడ్డి తెలిపారు. ఇక, సభకు వచ్చిన తెలంగాణ ప్రజలకు ధన్యవాదాలు.. బహిరంగ సభలో రేవంత్ రెడ్డి పేరు కేసీఆర్ చెప్పలేదని సీఎం బాధపడుతున్నారనిఎద్దేవా చేశారు. సీఎం రేవంత్ ని కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేలు గుర్తు పెట్టుకోవడం లేదని సెటైర్లు.. ఇక, తెలంగాణను ఆంధ్రాలో కలిపింది కాంగ్రెస్ పార్టీ.. తెలంగాణ పేరు ఎత్తితే వాళ్ళను నక్సలైట్ల పేరుతో కాంగ్రెస్ కాల్చి చంపింది అని గుర్తు చేశారు. చంద్రబాబు చేతిలో నడ్డి విరిగిన కాంగ్రెస్ 2004లో టీఆర్ఎస్ తో పొత్తు పెట్టుకుంది.. యూపీఏ కామన్ మినిమమ్ ప్రోగ్రామ్ లో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును టీఆర్ఎస్ పెట్టించింది.. కేసీఆర్ తిడుతున్న వాళ్ళు నాడు సమైక్యాంధ్ర తొత్తుల కింద ఉన్నారు అని జగదీష్ రెడ్డి పేర్కొన్నారు.ఎన్‌డిఎస్ఎ ఇచ్చిన రిపోర్ట్ నిజమని నిరూపించు ఉత్తమ్ కుమార్ రెడ్డి మాజీమంత్రి జగదీష్ రెడ్డి సవాల్ విసిరారు. కాంగ్రెస్ జాతీయ నాయకుడు రాహుల్ గాంధీ తెలంగాణకు వస్తే ఎవరూ పట్టించుకోలేదని ఎద్దేవా చేశారు. కేసీఆర్ ఏం మాట్లాడుతారోనని మీరు, ప్రజలు ఎదురు చూశారు.. అసెంబ్లీలో పిల్లల్ని ఏం పీకలేకపోతున్నారు.. అవతలి టీమ్ బలహీనంగా ఉందని పిల్లల్ని అసెంబ్లీకి పంపుతున్నారు.. కేసీఆర్ ఏ టైంకి, ఎట్లా రావాలో అసెంబ్లీకి వస్తారు.. ప్రతి రైతుకు రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేస్తామని జీవో ఇచ్చారు.. 41 వేల కోట్లు రుణమాఫీ అని చెప్పి 21 వేల కోట్లు చేశామని చెప్పారు.. ఇప్పుడు రైతు రుణమాఫీ పూర్తి అయిందని అంటున్నారు.. బీఆర్ఎస్ సభను చూసి లాగులు తడుపుకుంటున్నారని సెటైర్లు వేశారు.

## కాశ్మీర్‌లో మరిన్ని ఉగ్రదాడులు

న్యూఢిల్లీ,ఏప్రిల్29 జమ్ముకశ్మీర్‌లోని పహల్‌గామ్‌లో ఉగ్రవాదులు సృష్టించిన మారణకాండలో 26 మంది ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. ఈ ఘటన తర్వాత భారత్ పాకిస్థాన్ మధ్య ఉద్రిక్త వాతావరణం నెలకొంది. భారత భద్రతా బలగాలు ఉగ్రవాదులను అంతం చేసే పనిలో నిమగ్నమై ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఇంటెలిజన్స్ చేసిన ఓ హెచ్చరిక మరింత భయాందోళనకు గురి చేస్తోంది.

పహల్‌గామ్ ఘటనను మరవక ముందే కశ్మీర్‌లో మరిన్ని ఉగ్రదాడులు జరిగే ప్రమాదం ఉందని ఇంటెలిజన్స్ హెచ్చరికలు జారీ చేసింది. ఈ క్రమంలో 50 పర్యాటక ప్రదేశాలను జమ్ముకశ్మీర్ ప్రభుత్వం మూసివేసింది. దీంతో పబ్లిక్ మార్కులు, గార్డెన్లు ఇతర పర్యటక ప్రదేశాలు మూతబడ్డాయి. అయితే ఇవి మళ్లీ ఎప్పుడు తిరిగి తెరుచుకుంటాయనే విషయంలో స్పష్టత లేదు. ఇంటెలిజన్స్ నుంచి హెచ్చరికలు వచ్చిన నేపథ్యంలో భద్రతను మరింత కట్టు-దిట్టం చేశారు.

## నేడు విజయవాడకు సిఎం రేవంత్

**దేవినేని ఉమ తనయుడి వివాహానికి హాజరు- పెళ్లిలో చంద్రబాబును కలుసుకునే ఛాన్స్**



హైదరాబాద్,ఏప్రిల్29 తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. బుధవారం విజయవాడ వెళ్లనున్నారు.. బెజవాడలో జరగనున్న తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు కుమారుడు వివాహానికి హాజరు కాబోతున్నారు రేవంత్ రెడ్డి.. ఇక, విజయవాడ పర్యటన కోసం ఉదయం 9.15 గంటలకు హైదరాబాద్‌లోని బేగంపేట ఎయిర్‌పోర్ట్ నుంచి బయల్దేరి వెళ్లనున్నారు.. ఉదయం 10.40 గంటలకు కానూరు ధనేకుల ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణానికి చేరుకుంటారు.. ఉదయం 10.50 గంటల నుండి 11.30 గంటల వరకు అయన కల్యాణ మండపం నందు.. దేవినేని ఉమా కుమారుడు వివాహానికి హాజరై.. వధూవరులను ఆశీర్వదించనున్నారు.. విజయవాడ నుంచి తిరిగి మధ్యాహ్నం ఒంటి గంటకు బేగంపేట్ ఎయిర్‌పోర్ట్‌కు చేరుకోనున్నారు సీఎం రేవంత్ రెడ్డి..కాగా, గత వారం హైదరాబాద్‌లో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసిన మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు.. తన కుమారుడు వివాహానికి సంబంధించిన ఆహ్వాన పత్రికను సీఎంకు అందించి వివాహానికి రావాల్సిందిగా ఆహ్వానించారు.. మరోవైపు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో సుదీర్ఘకాలం తెలుగుదేశం పార్టీలో పనిచేసిన రేవంత్ రెడ్డి.. దేవినేని ఉమాతో సన్నిహితంగా ఉండేవారు.. దీంతో, మిత్రుడి ఆహ్వానం మేరకు ఆయన కుమారుడి వివాహానికి హాజరుకాబోతున్నారు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి.. ఇక, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కూడా ఈ వివాహానికి హాజరు అయ్యే అవకాశం ఉండడంతో.. పెళ్లి వేడుకలో రెండు తెలుగు రాష్ట్రాల సీఎంలు కలుసుకునే అవకాశం లేకపోలేదు..

# నామినేషన్ దాఖలు చేసిన పాకా

**పార్టీలో వెనకబడిన వర్గాలకు ప్రాధాన్యం**





విజయవాడ,ఏప్రిల్29 బీజేపీ రాజ్యసభ అభ్యర్థిగా ఎన్డీయే కూటమి తరపున పాకా వెంకట సత్యనారాయణను ఎంపిక చేయడంతో ఆయన మంగళవారం విజయవాడలో నామినేషన్ దాఖలు చేశారు. అంతకుముందు పార్టీ కార్యాలయానికి చేరుకున్న ఆయనకు కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, పార్థసారథి, ఇతర నేతలు శాలువాలతో సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా పాకా మాట్లాడుతూ నాలుగు దశాబ్దాలుగా తాను బీజేపీలో పని చేస్తున్నానని, బీజేపీ పట్టణ అధ్యక్షుడి నుంచి రాష్ట్ర నేతగా ఎదిగానని, డ్రాఫ్టింగ్ కమిటీ- ఛైర్మన్‌గా, కేంద్ర మంత్రుల బృందానికి కన్వీనర్‌గా, క్రమశిక్షణ సంఘం కమిటీ- ఛైర్మన్‌గా పని చేశానని అన్నారు. వెనుకబడిన తరగతుల వారికి పార్టీలో ప్రాధాన్యత, పార్టీ కోసం పని చేసే వారికి గుర్తింపు వస్తుందనేందుకు తనకు రాజ్యసభ ఎంపికే నిదర్శనమని పాకా వెంకట సత్యనారాయణ అన్నారు. రాష్ట్ర నేతలు అందరూ తన పేరు సూచించినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తన మీద ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టు-కునేలా పని చేస్తానని అన్నారు. ఏపీలో బీజేపీ బలోపేతం చేస్తూ కూటమి లక్ష్యాలను ముందుకు తీసుకెళతా న్నారు. అన్ని వర్గాల వారిని అక్కున చేర్చుకునేలా కలిసి పని చేస్తామని, దేశం హితం, రాష్ట్రం అభివృద్ధి కోసం కలిసి ప్రయాణిస్తామని స్పష్టం చేశారు. మోదీ నేతృత్వంలో జరిగే అభివృద్ధిలో తనకు భాగస్వామ్యం కలగడం ఆనందంగా ఉందన్నారు. మోదీ, అమిత్ షా, నడ్డాలతో కలిసి పనిచేసే అవకాశం రావడం మా పూర్వ జన్మ సుకృతంగా భావిస్తున్నానని అన్నారు. వివాదాస్పద చట్టాలు పక్కన పెట్టి మోదీ తీసుకునే నిర్ణయాలు ఆదర్శంగా ఉన్నాయని పాకా వెంకట సత్యనారాయణ పేర్కొన్నారు. పాకా సత్యనారాయణ మొట్టమొదటి నుంచీ బీజేపీ కోసం పని చేశారని, ఆయన సేవలు గుర్తించి రాజ్యసభకు ఎంపిక చేయడం ఆనందంగా ఉందని కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ అన్నారు. పార్టీని నమ్ముకుని పని చేసిన వ్యక్తికి సముచిత స్థానం దక్కిందని అన్నారు. తాను, ఆయన భీమవరం రోడ్లపై ఒకే బండి మీద తిరిగామని, 35 సంవత్సరాలుగా మేము కలిసి పని చేస్తున్నామని చెప్పారు.ఇప్పుడు ఢిల్లీలో కూడా మేమిద్దరం రాష్ట్రం కోసం కలిసి పని చేస్తామని అన్నారు. కార్యకర్తలు సేవలను గుర్తించి ఇటీవల పార్టీ నాయకత్వం నిర్ణయాలు తీసుకుంటు-ందని, తాను, పాకా సత్యనారాయణ, సోము వీర్రాజు, సత్యకుమార్‌లు సమకాలీకులమని తెలిపారు. మేమంతా కలిసిపని చేశామని.. ఇప్పుడు కలిసి పదవుల ద్వారా అభివృద్ధిలో భాగస్వామ్యం అయ్యామన్నారు. కష్టపడి పని చేసే కార్యకర్తలకు పార్టీలో తప్పకుండా గుర్తింపు ఉంటు-దని శ్రీనివాస వర్మ అన్నారు.

# హత్య కేసులో భార్యభర్తల అరెస్ట్

**- అరెస్ట్ వివరాలను వెల్లడిరచిన పెద్దపల్లి ఏసిపి జి.కృష్ణ**



పెద్దపల్లి (ఆకాంక్ష న్యూస్) :

పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్‌లో ఈ నెల 28న జరిగిన పోలం కుమార్ హత్య కేసులో ఇద్దరు నిందితులను పెద్దపల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అరెస్ట్ వివరాలను పెద్దపల్లి ఏసిపి జి.కృష్ణ వెల్లడిరచారు. ఈ హత్య కేసులో దొంగతుర్తి గ్రామానికి చెందిన భార్యభర్తలు వేల్పుల సంతోష్, వేల్పుల శ్కైలజలను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. పోలం కుమార్ ట్రాక్టర్ నడుపుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడని, గత కొన్ని రోజులుగా మృతుడు శ్కైలజలు సన్నిహితంగా ఉండడంతో శ్కైలజ ఫోన్ ద్వారా వారిరువురు ఫోన్‌లో మాట్లాడుకుంటున్నారని గుర్తించిన సంతోష్ వారి మధ్య అక్రమ సంబంధం ఉందని భావించి అతని భార్య శ్కైలజను మందలించగా ఆమె అతనికి భయపడి కుమార్ తన వెంట పడుతున్నాడని తెలిపిందని, అప్పటి నుండి మృతుడ్కైన కుమార్‌కు దూరంగా ఉంటుందని, సంతోష్ తన భార్య జోలికి వస్తే బాగుండదని కుమార్‌ను కుడా బెదిరించాడని తెలిపారు. ఈ క్రమంలో మృతుడు తనకు శ్కైలజకు మధ్య సంబంధం ఉందని వారి బంధువులతో చేపుతున్నాడని, అతను శ్కైలజకు ఫోన్ చేస్తున్నాడని కోపం పెంచుకున్న నిందితులు అతడిని చంపితే గాని వారి సమస్యకు పరిష్కారం ఉండదని, లేకుంటే బంధువుల మధ్య పరువు పోతుందని భావించారని, ఈ క్రమంలో పథకం ప్రకారం పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ వద్దకు రప్పించారని తెలిపారు. సంతోష్ మృతుడ్కైన కుమార్‌తో గొడవపడి అతడిని చంపే ఉద్దేశంతో తను తెచ్చుకొన్న కత్తితో కుమార్ మెడపై మొదటగా పొడవగా, శ్కైలజ అతడి చేతులు పట్టుకోగా సంతోష్ కత్తితో కుమార్ మేడపై, చాతిపై, మొకంపై పొడిచాడని, అతను తప్పించుకునే క్రమంలో శ్కైలజకు కత్తి పిడి వుడగా సంతోష్‌లకు కూడా చేతికి గాయాలయ్యాని తెలిపారు. ఆతర్వాత సంతోష్ మృతుడ్కైన కుమార్‌ను క్రింద పడేసి పెన్‌తో చాతిపై, పొట్ట భాగంలో పొడిచాడని, ఆతర్వాత సంతోష్, క్రింద పడి ఉన్న కుమార్ పొట్టపై, మేడపై కాళ్ళు పెట్టి నిల్చొని ఉండగా ఆ దగ్గర్లో ఉన్నవారు ఫోన్లో వీడియో తీస్తుండగా అది గమనించి మృతుడు చనిపోయినాడని భావించిన సంతోష్ తన భార్యతో కలిసి అక్కడి నుండి పారిపోయారని తెలిపారు. నమ్మదగిన సమాచారం మేరకు మంగళవారం పెద్దపల్లి సిఐ కె.ప్రవీణ్ కుమార్ తన సిబ్బందితో కలిసి దొంగతుర్తి కి వెళ్లి నిందుతులను వారి ఇంటి వద్ద అరెస్ట్ చేసినట్లు తెలిపారు. నిందుతుల వద్ద నుంచి నేరం చేసేందుకు ఉపయోగించిన కత్తి, రక్తం మరకలు గల బట్టలు, రెండు మొబ్కైల్ ఫోన్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

## ప్రధాని మోడీ పర్యటనకు భారీ ఏర్పాట్లు

**మోడీ పర్యటించేప్రాంతాలను పరిశీలించిన ఎస్పీజీ**




అమరావతి,ఏప్రిల్29:ప్రధాని నరేంద్ర మోడీ మరోసారి ఆంధ్రప్రదేశ్ పర్యటనకు రాబోతున్న వేళ ఏర్పాట్లు ముమ్మరం చేశారు. పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకుంటున్నారు. మే 2వ తేదీన ఏపీ రాజధాని అమరావతి పనులకు భారత ప్రధాని శంకుస్థాపన చేయబోతున్నారు .. మోడీ పర్యటనను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఏపీ ప్రభుత్వం.. ఇప్పటికే అన్ని రకాల ఏర్పాట్లను పూర్తి చేసింది.. మంత్రులు, అధికారులతో కమిటీలు వేసి.. ఎప్పటికప్పుడు పనులను పర్యవేక్షిస్తున్నారు.. ఇక, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.. ప్రతీరోజూ.. ప్రధాని మోడీ పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లపై సమీక్షలు నిర్వహిస్తూ ఆరా తీస్తున్నారు.. ఇక, ప్రధాని పర్యటనకు మూడు రోజుల ముందే ఎస్పీజీ రంగంలోకి దిగింది.. అమరావతి చేరుకున్న ప్రధాని మోడీ భద్రతా దళం.. ప్రధాని నరేంద్ర మోడీ పర్యటించే ప్రాంతాలను పరిశీలించి.. మోడీ టూర్ సాగే రూట్లలో ప్రయాణిస్తూ.. ప్రత్యేకంగా పరిశీలించింది.. హెలిప్యాడ్, సభా వేదిక మార్గం, సభా వేదిక వద్ద భద్రతా ఏర్పాట్లను పరిశీలించింది.. భద్రతా ఏర్పాట్లను ఎస్పజకి స్థానిక అధికారులు వివరించారు. ప్రధాని మోడీ అమరావతి పర్యటనకు సంబంధించిన షెడ్యూల్ ఇప్పటికే ఖరారు అయ్యింది.. ప్రధాని మోడీ టూర్‌కు సంబంధించిన షెడ్యూల్ అధికారికంగా ఏపీ ప్రభుత్వానికి అందింది..

రాజధాని నిర్మాణ పనుల పునఃప్రారంభంతో పాటు- పలు ప్రాజెక్టులకు ఆయన శంకుస్థాపన చేయనున్న విషయం విదితమే కాగా.. మే 2వ తేదీన తిరువనంతపురం ఎయిర్‌పోర్ట్ నుంచి ప్రత్యేక విమానంలో మధ్యాహ్నం 12.40 గంటలకు బయల్దేరి.. మధ్యాహ్నం 2.50 గంటలకు మోడీ గన్నవరం ఎయిర్‌పోర్ట్‌కు చేరుకోనున్నారు .. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో అమరావతికి చేరుకోనున్నారు. ఏపీ సచివాలయం ఎదురుగా ఉన్న హెలిప్యాడ్ నుంచి 3.30 గంటలకు వేదిక వద్దకు చేరుకుంటారు.. ఇక, అప్పటి నుంచి సాయంత్రం 4.45 గంటల వరకు వివిధ కార్యక్రమాల్లో భాగస్వామ్యం కాబోతున్నారు.. మొత్తంగా ప్రధాని మోడీ అమరావతి పర్యటన గంట 15 నిమిషాల పాటు- సాగనుంది.. ఆ తర్వాత హెలికాప్టర్‌లో గన్నవరం ఎయిర్‌పోర్ట్ చేరుకుని.. అక్కడి నుంచి సాయంత్రం 5.20 గంటలకు ఢిల్లీకి బయల్దేరి వెళ్లనున్నారు.

## సంపాదకీయం

# పాక్‌ను కోలుకోకుండా దెబ్బకొట్టాలి !

ముల్లును ముల్లుతోనే తీయాలి. కుక్కకాటుకు చెప్పుదెబ్బ అన్నట్లుగా ఉండాలి. పాక్ ఏర్పడడమే మత ఛాందసవాందతో ఏర్పడింది. తాము భారత్‌ను చీల్చి ఏర్పడ్డామన్న జ్ఞానం వారిలో లేదు. అలాగే భారత్ భిక్షతో దేశంగా ఏర్పడ్డామన్న కృతజ్ఞత బంగ్లాదేశీయులకు లేదు. ఈ రెండు దేశాల్లో మిగిలిన అరకొర హిందువులను తన్ని తరిమేయడం..కశ్మీర్ సహా భారత్‌లో చిచ్చుపెట్టడం వీరి లక్ష్యంగా ఉంది. అది ఎప్పుడో రుజువయ్యింది. మనం శాంతి వచనాలు పలుకుతూ పోతే సమస్య పరిష్కారంకాదు. భారత్‌తో పెట్టుకుంటే అంతే సంగతులు అన్న విధంగా మన జవాబు ఉండాలి. రష్యా ఉక్రెయిన్‌పై దాడిచేసింది. ఇజ్రాయిల్ పాలస్తీనాపై దాడులు చేస్తూనే ఉంది. ఇలాంటి దెబ్బలు మనం కూడా కొట్టగలగాలి. నష్టం కలిగినా ఫర్వాలేదు. దేశాన్ని పటిష్టం చేసే క్రమంలో మనమంతా త్యాగాలకు సిద్ధపడాలి. ఈ దేశాన్ని వందలాది ఏళ్లుగా ఎందరో దాడులు చేసి ధ్వంసం చేశారు. మనలను బానిసలుగా మార్చారు. ఇవన్నీ మనకు గుణపాఠం కావాలి. ఇంకా దాడులను తట్టుకుంటూ పోదాం అన్న పద్దతి మాత్రం మంచిది కాదు. పహల్గాం దాడి జరిగి వారం రోజులు అవుతోంది. పాక్ నుంచి శిక్షణ పొందిన ముష్కరులే దాడికి కారణమని తేలింది. ముంబై దాడులు కావచ్చు..పుల్వామా దాడి కావచ్చు...పహల్గామ్ కావచ్చు.. అన్నీ పాక్ కుతంత్రాల వల్లనే జరిగిన ఘటనలు. అయినా దాయాది దేశానికి బుద్ధి రావడం లేదు. పహల్గాం దాడిలో పాల్గొన్న నలుగురు ఉగ్రవాదుల్లో ఒకడైన హషీమ్ మూసా పాక్ సైన్యంలో మాజీ పారా కమాండో అని దర్యాప్తులో తేలింది. దీనిని బట్టి పాక్ సైన్యంలో పనిచేసిన వారు ఆ తరవాత ఎలా ఉగ్రవాదులుగా మారుతున్నారో గమనించాలి. ప్రస్తుతం అతడు కరుడుగట్టిన టెర్రరిస్టుగా మారినట్లు దర్యాప్తు బృందాలు పేర్కొన్నాయి. పాక్‌కు చెందిన లష్కరే తోయిబాతో కలిసి అతడు పని చేస్తున్నట్లు వెల్లడించాయి. ఆ సంస్థ మాస్టర్ మైండ్లే అతడిని కశ్మీర్‌కు పంపినట్లు- పేర్కొన్నాయి. ఇప్పటికే భారత సైన్యం ఉగ్రవాదులకు అనుకూలంగా పని చేస్తున్నారన్న అనుమానంతో వందల మంది స్థానికులను అదుపులోకి తీసుకొంది. వీరిలో 15 మంది ఉగ్రవాద ఓవర్ గ్రౌండ్ వర్కర్స్, మూసాకు ఉన్న సైనిక నేపథ్యాన్ని ధ్రువీకరించారని అధికారులు వెల్లడించారు. అతడు పాక్ స్పెషల్ సర్వీస్ గ్రూప్ నుంచి లష్కరేలోకి సహాయకారిగా వచ్చినట్లు తెలుస్తోందని సైన్యం ధృవీకరించింది. ఇంతకన్నా ఆధారాలు ఇక అవసరం లేదు. కాశ్మీర్‌లో 370 ఆర్టికల్ ఎత్తేసిన తరవాత అక్కడ శాంతి నెలకొనడమే గాకుండా స్థానికులకు ఉపాధి దక్కుతోంది. పర్యాటకం పెరిగింది. అక్కడి యువతలో కూడా మార్పు వచ్చింది. వారంతా జనజీవన స్రవంతిలో కలిసి పోతున్నారు. దీనిని విచ్ఛిన్నం చేసే పన్నాగమే ఉగ్రదాడి అని తేలింది. కశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఘటన అమాన వీయమైనదే కాదు.... మనిషన్నవాడు చేసే పని కాదు. ఇది కేవలం రాక్షస జాతి మాత్రమే చేస్తుంది. పాక్ పెంచి పోషిస్తున్న రాక్షసులు భారత్‌ను లక్ష్యంగా చేసుకుంటున్నారు. ఇందుకుమనం కూడా సన్నద్దం కావాలి. మరణించిన వారి ఆత్మకు శాంతి జరగాలి. ఉగ్రమూకలను చీల్చి చెండాడం ద్వారా మన సత్తా చాటాలి. అలాగే కాశ్మీర్‌లో ఉంటూ...ఉగ్రమూకలను పెంచి పోషిస్తున్న కొందరు పాక్ సానుభూతిపరులను కూడా గుర్తించి కఠినంగా శిక్షించాలి. వారిని కూడా ఉగ్రదాడులకు బాధ్యులను చేయాలి. భూతల స్వర్గంగా భావిస్తున్న కశ్మీర్‌ను చూడాలని వెళ్లిన పర్యాటకులను హతమార్చిన ఘటనను ఇప్పటికీ భారతీయులు జీర్ణించుకోలేక పోతున్నారు. ఈ నరమేధాన్ని ప్రపంచ దేశాలు అన్నీ తీవ్రంగా నిరసించాయి. కేంద్ర ప్రభుత్వం ఇందుకు తగిన విధంగానే ప్రతిస్పందించింది. ఈ దుర్ఘటనకు కారణమైన ది రెసిస్టెన్స్ ఫ్రంట్ (టిఆర్ఎఫ్)ను, దానికి సహకారం అందించిన లష్కర్ ఎ తోయిబాను, దీనికి వెన్నుదన్నుగా ఉన్నదను కుంటున్న పాకిస్థాన్‌ను లక్షంగా చేసుకొని తక్షణ చర్యలు చేపట్టింది. తక్షణమే రెండు దేశాల ద్వైపాక్షిక సంబంధాలను రద్దు చేయడం, నీటి ఒప్పందాలను వెనక్కు తీసుకోవడంతోపాటు ఇంకా అనేక చర్యలు చేపట్టింది. సరిహద్దులను మూసివేయడం కూడా వెంటనే అమలు చేశారు. అదే విధంగా దాడికి బాధ్యులైన వారి లక్షంగా గాలింపు ముమ్మరం చేశారు. ఇవన్నీ ఊహించినవే అయినా సరిపోవని గుర్తించాలి. ప్రజల్లో వస్తున్న తీవ్ర నిరసన కారణంగా దాడులకు తక్షణ చర్యలు ఉండాలి. ఇప్పటికే కాశ్మీర్‌లో వేలాదిమంది పౌరులు, సైనికులు నేలకొరిగారు. వేలాదిమందిని హత్యలు చేశాలరు. లక్షల మందిని మత మార్పిళ్లు చేశారు. ఇవన్నీ గమనించిన తరవాతనే కేంద్రం 2019లో 370 ఆర్టికల్ రద్దు చేసి కశ్మీర్ స్వయం ప్రతిపత్తిని ఎత్తేసింది. దీంతో సాధారణస్థితికి వచ్చి కాశ్మీర్ పర్యాటకంగా మళ్లీ చిగురించింది. దీనిని జీర్ణించుకోలేని పాక్ పాపాల భైరవులు దాడులకు తెగించారు. ఈ క్రమంలో అసవరమైతే యుద్ధం దాకా కూడా భారత ప్రభుత్వం వెళ్లవచ్చునని పరిశీలకులు భావిస్తున్నారు. ఈ క్రమంలో ఇక పాక్‌ను ఎంతమాత్రం నమ్మరాదు. పాముకు పాలుపోసి పెంచినట్లుగా మన గత పాలకులు పాక్ పాలకులకు చేయూతను ఇచ్చారు. అందువల్ల మనం ఎంతమాత్రం ఉపేక్షించరాదు. కష్టమైనా, నష్టమైనా దేశాన్ని ఏకతాటిపైకి తీసుకుని రావాలి. రాజకీయపార్టీలు కూడా విభేదాలు పక్కన పెట్టి పాక్‌కు గుణపాఠం చెప్పే ప్రయత్నాలకు బేషరతు మద్దతు పలకాలి. అలాగే పాక్ ఉనికినే ప్రశ్నార్థకం చేసేలా ప్రతీకార చర్యలు ఉండాలి.

# నలుగురు ముష్కరుల్లో ఒకడి గుర్తింపు

- షహీమ్ మూసా పారా కమెండొగా గుర్తింపు
- లష్కరే తోయిబాతో చేతులు కలిపి దాడికికుట్ర
- మిర్ని దాడులు జరగకుండా అప్రమత్తం అయిన సైన్యం



న్యూఢిల్లీ,ఏప్రిల్29: పహల్గాం దాడిలో పాల్గొన్న నలుగురు ఉగ్రవాదుల్లో ఒకడైన హషిమ్ మూసా పాక్ సైన్యంలో మాజీ పారా కమాండో అని దర్యాప్తులో తేలింది. దీంతో పాక్ సైన్యం కనుసన్నల్లోనే దాడులు జరుగుతున్నాయని రుజువయ్యింది. ప్రస్తుతం అతడు కరుడుగట్టిన టెర్రరిస్టుగా మారినట్లు దర్యాప్తు బృందాలు పేర్కొన్నాయి. పాక్‌కు చెందిన లష్కరే తోయిబాతో కలిసి అతడు పని చేస్తున్నట్లు వెల్లడిం చాయి. ఆ సంస్థ మాస్టర్ మైండ్లే అతడిని కశ్మీర్‌కు పంపినట్లు పేర్కొన్నాయి. ఉగ్రవాదులకు అనుకూలంగా పని చేస్తున్నారన్న అనుమానంతో వందల మంది స్థానికులను ఇప్పటికే భారత సైన్యం అదుపులోకి తీసుకొంది. వీరిలో 15 మంది ఉగ్రవాద ఓవర్ గ్రౌండ్ వర్కర్స్, మూసాకు ఉన్న సైనిక నేపథ్యాన్ని ధ్రువీక రించారని అధికారులు వెల్లడించారు. దీనిని బట్టి పాక్ కుతంత్రాలను గమనించవచ్చు. అతడు పాక్ స్పెషల్ సర్వీస్ గ్రూప్ నుంచి లష్కరేలోకి సహాయకారిగా వచ్చినట్లు తెలుస్తోందని దర్యాప్తు బృందానికి చెందిన ఓ అధికారి పత్రికలకు వెల్లడించారు. ఈనేపథ్యంలో ఉగ్రవాదులకు, పాక్ సైన్యానికి మధ్య ఉన్న సంబంధాలను ఇది తెలియజేస్తోందన్నారు. పాక్ పారా కమాండోలు అత్యాధునిక శిక్షణ పొందు తున్నారు. వీరు సంప్రదా యేతర యుద్ధతంత్రం, కోవర్ట్ ఆపరేషన్లలో దిట్టలు. శిక్షణలో వీరిని మానసికంగా.. శారీరకంగా బలోపేతం చేస్తారు. దీంతోపాటు- యుద్ధరంగంలో ఎత్తుగడలు కూడా నేర్పిస్తారు. వీరు అత్యాధునిక ఆయుధాల వినియో గంలోను, నేరుగా చేతులతో పోరాడటంలోను నిపుణులు. ఈ దాడిలో పాల్గొన్న వారిలో కొందరు గతంలో గగన్‌నగర్, గదర్‌బాల్ అడవుల్లో ఆరుగురు స్థానికేతరులు, ఒక డాక్టర్‌ను, ఇద్దరు సైనిక పోర్టర్లను హత్య చేసిన ఘటనల్లో పాల్గొన్నారు. మూసా మాత్రం ఈ మూడు దాడుల్లోను పాల్గొన్నాడు. ఇక జునైద్‌భట్, అర్బాజ్ మిర్ కూడా పాక్‌లో శిక్షణ పొందినట్లు- గుర్తించారు. పహల్గాంకు చేరుకునేందుకు దాదాపు 22 గంటల పాటు టెక్కింగ్ చేసినట్లు దర్యాప్తులో తేలిందని సంబంధిత వర్గాలు తెలిపాయి. తమ ప్రణాళికను అమలుచేసేందుకు కోకెర్నాగ్ అడవుల నుంచి బైసరన్ లోయ వరకు కాలి నడకన వచ్చినట్లు తెలుస్తోంది. ఈ విషయమే ఉగ్రమూకకు సైనిక శిక్షణ లభించిన అంశాన్ని తెలియ జేస్తోంది. ఇప్పటికే ఈ మూకను భారత సైన్యం వేటాడుతోంది. నాలుగుసార్లు త్రుటిలో వారు భద్రతా దళాల నుంచి తప్పించ్చుకొన్నారు. మరికొన్ని రోజుల్లో దొరకవచ్చని అధికారులు చెబుతున్నారు. ఈక్రమంలో వారిని కనుగొనేందుకు అడవుల్లో గాలిస్తున్నారు. పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రదాడి తర్వాత భారత భద్రతా బలగాలు అప్రమత్త మయ్యాయి. ముష్కరులను పట్టుకునేందుకు గాలింపు చర్యలను ముమ్మరం చేశాయి. పహల్గామ్ ఉగ్రదాడిపై జాతీయ దర్యాప్తు సంస్థ ఎన్ఐఎ దర్యాప్తు చేస్తోంది. ఈ ఘటనకు సంబంధించిన పలు వీడియోలు, సమాచారం అందడంతో వాటి ఆధారంగా.. ఉగ్రవాదులను గుర్తించడానికి విచారణను వేగవంతం చేసింది. ఇందులోభాగంగా ఉగ్రదాడి ప్రదేశంలో సీన్ రీక్రియేట్ చేస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఆ సమయంలో ఉన్న పర్యాటకులు, స్థానిక ప్రజలను ప్రశ్నిస్తున్నారు. అక్కడ వారు తీసుకున్న ఫొటోలు, వీడియోలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామని చెప్పారు. ఈక్రమంలో కశ్మీర్‌లో మరిన్ని ఉగ్ర దాడులు జరిగే అవకాశం ఉందని ఇంటెలిజెన్స్ వర్గాలు హెచ్చరించాయి. పహల్గాం దాడి అనంతరం కశ్మీరీ లోయలో స్లీపర్‌సెల్స్ యాక్టివేట్ అయినట్లు తెలిపాయి. పహల్గాం ఉగ్రదాడి తర్వాత జమ్మూకశ్మీర్‌లో ఉన్న ఉగ్రవాదుల ఇళ్లను సైన్యం పేల్చేస్తుండడంతో దానికి ప్రతీకారంగా వారు పెద్దఎత్తున దాడులకు ప్రణాళికలు రచిస్తున్నట్లు- తమకు సమాచారం అందిందని నిఘా వర్గాలు పేర్కొన్నాయి. స్థానిక ప్రజలు, పర్యాటకులు అప్రమత్తంగా ఉండాలని..ఎవరైనా అనుమానాస్పదం గా కనిపిస్తే భద్రతా బలగాలకు సమాచారం ఇవ్వాలని సూచించాయి. దీంతో ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా కశ్మీర్ వ్యాప్తంగా ఉన్న మొత్తం 87 టూరిస్టు కేంద్రాల్లో 48 కేంద్రాలను మూసివేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. కశ్మీర్‌లోని ప్రధాన ప్రదేశాలు గుల్మార్గ్, సోనామార్గ్ దాల్ లేక్ ప్రాంతాలతో సహా పలు సున్నితమైన పర్యాటక ప్రదేశాల్లో భద్రతా దళాలు, స్థానిక పోలీసులు ప్రత్యేక బృందాలను మోహరించాయి. ఏప్రిల్ 22న పహల్గాం సమీప బైసరన్ లోయలో ఉగ్రవాదులు భీకర దాడికి పాల్పడిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో 26 మంది ప్రాణాలు కోల్పోగా.. పదుల సంఖ్యలో గాయపడ్డారు. దీంతో అక్కడినుంచి పర్యాటకులను ప్రత్యేక విమానాల్లో తరలించి.. ఉగ్రవాదుల కోసం భద్రతా బలగాలు ముమ్మర గాలింపు చర్యలు చేపట్టాయి. ప్రస్తుతం మళ్లీ పర్యాటకులు కశ్మీర్‌కు వస్తున్న నేపథ్యంలో నిఘా వర్గాలు తాజా హెచ్చరికలు చేశాయి.

# రాజకీయాల్లో నాటి విలువలు...నేడెక్కడ....?

పాలకపక్షాలు సమస్యలను పరిష్కరించాయి. ఇది నాడు రాజకీయ నాణానికి ఒకవైపు అయితే నాణానికి మరో కోణమే నేటి రాజకీయ పోకడలు పార్టీలు పార్టీలకు చెందిన నేతలు కార్యకర్తలు సైతం వ్యక్తిగత ప్రతిష్టలకు పోతుండడంతో సమస్యలపై పోరాటాలు తగ్గుతున్నాయి.సమస్యల సాధన కోసం గొంతెత్తిన స్వరాలను మూగబోయే విధంగా చేస్తున్నారు. ఈ నేపధ్యంలోనే అనేక సమస్యలు తలెత్తుతున్నాయి. సోషల్ మీడియాలో విడివిడి జ్ఞానం (సగం మెదడు) కలిగిన కొంత మంది సోషల్ మీడియా వేదికగా చేస్తున్న విమర్శలు శాంతి భద్రతలకు విఘాతం ఏర్పడే విధంగా రెచ్చగొట్టి వ్యాఖ్యలు చేస్తూ కొందరు నాయకులు క్షుద్ర రాజకీయానికి తెరతిస్తున్నారనే భావన సగటు మనుషులలో వ్యక్తం అవుతుంది. “పంచదార తినడానికి తీయగా ఉంటుంది... కానీ పైత్య రోగికి అది చేదుగా అనిపిస్తుంది. కానీ చేదు పైత్య ప్రభావం వల్ల వచ్చిందే అని గమనించరు” అనే సామెత నేటి రాజకీయ వ్యవస్థలో కొంత మంది నాయకులకు సరిగ్గా సరిపోతుంది.. అయితే నేడు తెలంగాణ రాష్ట్రంలో రాజకీయ పరిస్థితులు ఏ నియోజకవర్గంలో ఎలా ఉన్న రామగుండం నియోజకవర్గంలో మాత్రం ఈ జాడ్యం విస్ఱ0ఖాలంగా మారుతుంది. అధికార పార్టీ ఒక విధంగా వాక్యాన్ని ఇస్తే అదే రీతిన ప్రతిపక్షాలు తిప్పి కొడుతున్నాయి. ఎవరు అధికారంలో ఉన్న వారి వైపే అధికారులు ఉంటారన్న విమర్శలు రాజకీయంగా లేకపోలేదు.అదే రీతిలో ప్రతిపక్షాలు కూడా పోలీసు వ్యవస్థపై ఆరోపణలు చేస్తూనే ఉన్నాయి. గత కొంతకాలంగా రామగుండం నియోజకవర్గంలో రాజకీయాలపై జరుగుతున్న రాజకీయ వికృత చేష్టలు హద్దులు మీరుతున్నాయి. రాజకీయపరంగా కాకుండా వ్యక్తిగత విమర్శల వైపు దారి తీస్తున్నాయి. సోషల్ మీడియాను ఆధారంగా చేసుకుని జీవితంలో వ్యక్తిగత విషయాలను సంబోధించడం పట్ల తీవ్ర స్థాయిలో వ్యతిరేకత మొదలవుతుంది. రాజకీయాల్లో ఒకప్పుడు పరోక్షంగా ఆరోపణలు చేసుకునే స్థాయి నుండి ప్రత్యక్షంగా వ్యక్తిగతంగా తిట్టుకునే స్థాయికి రాజకీయాలు దిగజారిపోతున్నాయి అనడంలో ఎటువంటి సందేహం లేదని చెప్పవచ్చు.

### సోషల్ మీడియా వేదికగా తిట్ల పురాణం...

ఉద్రేక రాజకీయాలకు కేంద్ర బిందువుగా సోషల్ మీడియా వ్యవహరిస్తుంది. ఎక్కడ సంఘటన జరిగినా, లేక ఎటువంటి రాజకీయ కార్యక్రమమైన ఆయా పార్టీలకు చెందిన కొంతమంది నాయకులు వ్యక్తిగత జీవితాలను టార్గెట్ చేస్తూ వ్యంగ్యంగా మాట్లాడటం రాజకీయపరంగా దుమారాన్ని కలిగిస్తుంది. దీనికి తోడు ప్రధాన రాజకీయ పార్టీలకు నియోజకవర్గాల వారిగా సోషల్ మీడియా ఉండటంతో వారి చర్యలు ఇష్ట రాజ్యాంగా మారిపోతున్నాయనే ప్రచారం సాగుతుంది.

### మారుతున్న రామగుండం రాజకీయాల పరాకాష్ట....

సాంప్రదాయ రాజకీయ విలువలతో ముడిపడిన ఉమ్మడి నగర్ జిల్లాలో రామగుండం రాజకీయాలకు ప్రత్యేక పేరు ప్రఖ్యాతి ఉంది. అయితే కొంతమంది అనాలోచిత విడివిడి జ్ఞానం కలిగిన నాయకుల వల్ల రాజకీయాలు ఉద్రేక రాజకీయాలుగా మారి బూతుల రాజకీయంగా కొనసాగుతున్నాయి. సోషల్ మీడియాని ఆసరాగా చేసుకుని నిత్యం సోషల్ మీడియాలో ఇతర పార్టీలను రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలను చేస్తూ శాంతిభద్రతలకు ఆటంకం కలిగిస్తూ పైశాచిక ఆనందాన్ని పొందుతున్నారనే రాజకీయ విమర్శలు వినిపిస్తున్నాయి. పార్టీ కార్యక్రమాలను, వారి నాయకులు చేసే అభివృద్ధి పనులను నిత్యం సోషల్ మీడియా వేదికగా ప్రజలకు వివరించాల్సింది పోయి అదే సోషల్ మీడియాలో ఇతర పార్టీ నాయకులను టార్గెట్ చేస్తూ విడివిడి జ్ఞానం కలిగిన రాజకీయంతో గందరగోళ పరిస్థితులకు గురిచేస్తున్నారు. సోషల్ మీడియాలో నిత్యం మాట్లాడుతున్న సమయంలో దానిపై వస్తున్న వ్యతిరేకతను కొంత మంది నాయకులు గుర్తించుకోకుండా తెలివి తక్కువ తనంతో పార్టీకి నష్టం కలిగించే విధంగా చర్యలకు పాల్పడుతున్న వారి పట్ల తమ అధినాయకత్వం ఎందుకు ఆలోచన చేయడం లేదనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటికైనా దీనిపై తమ అధినాయకత్వం పునరలోచించుకొని ఉద్రేక వ్యక్తిగత రాజకీయాలకు అడ్డుకట్ట వేయకపోతే రానున్న రోజుల్లో తమ పార్టీకి నష్టం కలుగుతుందనే విషయాన్ని గమనించుకోవాలని పలువురు రాజకీయ నిపుణులు భావిస్తున్నారు.

### నాయకత్వం సోషల్ మీడియాకు అడ్డుకట్ట వేయకపోతే పార్టీకి నష్టం తప్పదు..

పార్టీలో ఉన్న కొంతమంది కిందిస్థాయి నాయకులు సోషల్ మీడియా వేదికగా వ్యక్తిగత జీవితాలపై విమర్శస్త్రాలు చేస్తూ వికృత చేష్టలకు పాల్పడుతున్న వారికి అడ్డుకట్ట వేయకపోతే పార్టీకి నష్టం వచ్చే ప్రమాదం ఉంటుందని పలువురు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ రోజుల్లో సోషల్ మీడియా ఎంతో వేగవంతంగా దూసుకుపోతుంది అని చెప్పడంలో ఎటువంటి సందేహం లేదు. ఇలాంటి క్రమంలో తమ అధినాయకత్వం చేసే కార్యక్రమాలు, అభివృద్ధి పనులు ఎప్పటికప్పుడు ప్రజలకు వివరిస్తూ అర్థమయ్యే రీతిలో సోషల్ మీడియాలో వెల్లడించాలి. కానీ తమ తెలివి తక్కువ తనంతో కొంతమంది వ్యవహరిస్తున్న తీరుతో పార్టీకి లాభం కంటే నష్టమే ఎక్కువ కలిగించే విధంగా చేస్తుండడం విమర్శలకు తావిస్తుంది. ఈరోజు పార్టీ గురించి కానీ పార్టీ కార్యక్రమాల గురించి కానీ తమ నాయకుడు చేసే విషయాలను వెల్లడించకుండా కేవలం వ్యక్తిగతంగా మాత్రమే దూషించడం పార్టీలో వ్యతిరేకతకు దారితీస్తుందని పలువురు విశ్లేషకులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా తమ అధినాయకత్వం గుర్తించి పార్టీకి నష్టం కలిగించే విషయాలపై దృష్టి సారించాలని పలువురు తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు.




# రిలయన్స్ జోరు.. మార్కెట్లో హుషారు

ముంబై: భారత స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు సోమవారం భారీగా లాభపడ్డాయి. భారత్-పాక్ సరిహద్దుల్లో ఉద్రిక్తతల కారణంగా గత వారాంతంలో ఏర్పడిన నష్టాలను పూర్తిగా పూడ్చుకోగలిగాయి. సెన్సెక్స్ 1,005.84 పాయింట్లు (1.27 శాతం) ఎగబాకి 80,218.37 వద్దకు చేరగా.. నిఫ్టీ 289.15 పాయింట్ల (1.20 శాతం) వృద్ధితో 24,328.50 వద్ద ముగిసింది. అంచనాలను మించిన ఆర్థిక ఫలితాలు ప్రకటించిన రిలయన్స్ ఇండస్ట్రీస (ఆర్ఐఎల్)తో పాటు బ్యాంకింగ్, ఫార్మా, ఎనర్జీ, ఆటో రంగ షేర్లలో మదుపరులు భారీగా కొనుగోళ్లు జరపడం ఇందుకు దోహదపడింది.




# వరుసగా రెండో రోజు లాభాలతో మొదలైన స్టాక్ మార్కెట్లు..

భారత స్టాక్ మార్కెట్లు తగ్గేదేలే అన్నట్లు కొనసాగుతున్నాయి. భారత్, పాకిస్తాన్ యుద్ధ వాతావరణం సహా పలు ఉద్రిక్త పరిస్థితులు ఉన్నప్పటికీ మార్కెట్లు మాత్రం పాజిటివ్ ధోరణుల్లోనే దూసుకెళ్తున్నాయి. అయితే సూచీలు ఏ మేరకు పెరిగాయనే విషయాలను ఇక్కడ తెలుసుకుందాం. వరుసగా రెండో రోజు లాభాలతో మొదలైన స్టాక్ మార్కెట్లు..ఇవే టాప్ 5 స్టాక్స్భారత స్టాక్ మార్కెట్ నేడు (ఏప్రిల్ 29న) కూడా రెండో రోజు లాభాలతో మొదలైంది. ప్రపంచ మార్కెట్ల నుంచి వచ్చిన మిశ్రమ సంకేతాలు, భారతదేశం, పాకిస్తాన్ మధ్య ఉద్రిక్త పరిస్థితులు, సుంకాల పరంగా ఉన్న అనిశ్చితి వంటివి మార్కెట్లపై ఈరోజు కొంత ప్రభావం చూపినట్లు కనిపిస్తోంది. ఈ క్రమంలో %దీూజు% సెన్సెక్స్ 167.62 పాయింట్లు (0.21%) పెరిగి 80,385.99 స్థాయిలో ఉండగా, నిఫ్టీ 50 62.55 పాయింట్ల లాభంతో 24,391.05 వద్ద ప్రారంభమయ్యింది. మరోవైపు బ్యాంక్ నిఫ్టీ 250 పాయింట్లు, నిఫ్టీ మిడ్ క్యాప్ 100 సూచీ



413 పాయింట్లు పడిపోయింది. ఈ నేపథ్యంలో మదుపర్లు కొన్ని నిమిషాల వ్యవధిలోనే వేల కోట్ల రూపాయలను ఈ క్రమంలో భారత్ ఎలక్ట్రికల్, ట్రెంట్, రిలయన్స్,లార్సెన్, టాటా మోటార్స్ కంపెనీల స్టాక్స్ టాప్ 5 లాభాల్లో ఉండగా, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్, సన్ ఫార్మా, నెస్లే, అల్ట్రాటెక్ సిమెంట్, సిప్లా సంస్థల స్టాక్స్ టాప్ 5 నష్టాల్లో ఉన్నాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్, నిఫ్టీ స్మాల్ క్యాప్ సూచీలు కూడా ఈ రోజు మిశ్రమమైన ట్రెండ్‌ను చూపిస్తున్నాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ 0.5% పెరిగింది, అలాగే నిఫ్టీ స్మాల్ క్యాప్ 0.8% లాభాన్ని నమోదు చేసింది. ఈ సూచీలు చిన్న, మధ్య తరగతి కంపెనీలకు సంబంధించినవి. వాటిలో పెట్టుబడులు పెట్టడం ద్వారా మార్కెట్ కోసం మంచి అవకాశాలను చూడవచ్చు.

# మళ్లీ పుంజుకున్న బంగారం, వెండి ధరలు

ఈరోజు బంగారం, వెండి కొనుగోలు చేయాలని చూస్తున్నారా. అయితే మీకు గుడ్ న్యూస్. ఎందుకంటే నేటి ఉదయం నాటికి పసిడి ధరలు భారీగా పెరిగాయి. ఆ వివరాలేంటో ఇప్పుడు చూద్దాం.దేశవ్యాప్తంగా రేపు (ఏప్రిల్ 30న) అక్షయ తృతీయ పండుగ జరగనుంది. ఈ సందర్భంగా నేడు మీరు పసిడి లేదా వెండి కొనుగోలు చేయాలని చేస్తున్నారా. అయితే నేటి ధరల గురించి మాత్రం తప్పక తెలుసుకుని వెళ్లండి. ఈ క్రమంలో ఏప్రిల్ 29న గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం ఉదయం 11.26 గంటలకు 24 క్యారెట్ల బంగారం ధర మళ్లీ పెరిగి రూ. 97,970 స్థాయికి చేరుకుంది. ఇక 22 క్యారెట్ల గోల్డ్ ధర రూ. 89,800గా కలదు. ఇదే సమయంలో దేశ రాజధాని ఢిల్లీలో 24 గోల్డ్ రేటు రూ. 98,120 స్థాయిలో ఉండగా, 22 క్యారెట్ల గోల్డ్ ధర రూ. 89,950గా కలదు.




## నేటి వెండి ధరలు

ఇదే సమయంలో వెండి రేట్లు కూడా పెరిగాయి. ఈ నేపథ్యంలో ఢిల్లీలో కేజీ వెండి ధర రూ.100 పెరిగి రూ.100,500 స్థాయికి చేరుకుంది. మరోవైపు హైదరాబాద్, విజయవాడలో రూ. 111,000 ఉండగా, చెన్నైలో రూ.111,000, పూణేలో రూ.100,500, బెంగళూరులో రూ.100,500 పరిధిలో ఉంది. స్టాక్ మార్కెట్లు ప్రారంభమైన తర్వాత బంగారం, వెండి రేట్లలో మార్పులు జరిగే అవకాశం ఉంది. కాబట్టి వీటిని కొనుగోలు చేసే ముందు వీటి ధరలను తప్పక తెలుసుకోవాలి.

# గుడ్లు మంచిగా ఉన్నాయో లేదో ..

## సెల్‌ఫోన్ ఫ్లాష్‌లైట్‌తో ఇలా ట్రై చేయండి..



గుడ్డు ఆరోగ్యానికి చాలా మంచిది. ఇందులో ప్రోటీన్ పుష్కలంగా ఉంటుంది. కానీ, గుడ్లు అన్ని మంచిగా ఉండవు. కొన్ని చెడిపోయి కూడా ఉంటాయి. అయితే, గుడ్లు మంచిగా ఉన్నాయో లేదో తెలుసుకోవడానికి ఓ సింపుల్ ట్రిక్ ఉంది. అదెంటో ఇప్పుడు తెలుసుకుందాం.. గుడ్డు ఆరోగ్యానికి చాలా మంచిదని అందరికీ తెలిసిందే. ఇందులో ప్రోటీన్ పుష్కలంగా ఉంటుంది. రిఫ్రిజిరేటర్‌లో నిల్వ చేసిన గుడ్లు చాలా కాలం పాటు తాజాగా ఉంటాయి. కానీ, కొన్ని గుడ్లు బయటకు మంచిగా కనిపించినా పగలగొట్టి చూస్తే చెడిపోయి ఉంటాయి. అయితే, మనం గుడ్లను పగలగొట్టకుండానే గుడ్లు మంచిగా ఉన్నాయో లేదో తెలుసుకోవడానికి ఓ సింపుల్ ట్రిక్ ఉంది. అదెంటో ఇప్పుడు తెలుసుకుందాం..

## ఫోన్ ఫ్లాష్‌లైట్‌తో..

ఇటీవల, ఫిట్‌నెస్ స్పెషలిస్ట్ ప్రణవ్ జాండియల్ సోషల్ మీడియాలో ఒక వీడియో పోస్ట్ చేశారు. అందులో అతను మంచి గుడ్డును చెడు గుడ్డు ఎలా గుర్తించాలో ఒక సింపుల్ ట్రిక్ ద్వారా చేసి చూపించాడు. ముందుగా, అతను కొన్ని గుడ్లను తీసుకున్నాడు. తర్వాత తన ఫోన్ ఫ్లాష్‌లైట్‌ను ఆన్ చేసి, గుడ్డును లైట్ పైన ఉంచాడు. గుడ్డు లోపల నుండి పసుపు రంగుతో మెరుస్తుంటే అది తాజాగా ఉంటుందని, ఉపయోగించడానికి సురక్షితం అని తెలిపాడు. అయితే, తక్కువ లేదా వెలుతురు లేకపోతే, ఆ గుడ్డు చెడిపోయిందని సంకేతం అని వివరించాడు. కుళ్ళిన గుడ్డును పగలగొట్టే ముందే ఫ్లాష్‌లైట్ పద్ధతి ద్వారా దానిని గుర్తించవచ్చని తెలిపాడు.

# ఈ 5 ఆహార పదార్థాలను అరటిపండ్లతో తింటున్నారా.. జాగ్రత్త ..

అరటిపండ్లతో కొన్ని ఆహార పదార్థాలను తింటే ఆరోగ్యం క్షీణిస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ 5 ఆహార పదార్థాలను అరటిపండ్లతో కలిపి తినడం ఏ మాత్రం మంచిది కాదని చెబుతున్నారు. అవెంటో ఇప్పుడు తెలుసుకుందాం..

అరటిపండ్లలో పోషకాలు పుష్కలంగా ఉంటాయి. పొటాషియం, విటమిన్ బి6, కాల్షియం, ఫైబర్, ఫాస్ఫరస్, మెగ్నీషియం వంటి ముఖ్యమైన పోషకాలు సమృద్ధిగా ఉంటాయి కాబట్టి వీటిని సూపర్ ఫుడ్ అని కూడా అంటారు. అరటిపండ్లను మీ ఆహారంలో తీసుకుంటే ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. శక్తి స్థాయిలను పెంచడం, బరువు తగ్గడానికి సహాయపడటం, జీర్ణవ్యవస్థను మెరుగుపరచడం వంటి అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉంటాయి. అదనంగా, ఎముకలు, కండరాలను బలోపేతం చేయడంలో అరటిపండ్లు ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. ప్రతిరోజూ 1-2 అరటిపండ్లు తింటే ఆరోగ్యానికి మంచిదని నిపుణులు కూడా చెబుతారు. అయితే, అరటిపండ్లతో కొన్ని ఆహార పదార్థాలు తింటే ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావాలు ఉంటాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అరటిపండ్లు తినేటప్పుడు ఈ ఆహారాలను నివారించాలని సూచిస్తున్నారు. అవెంటో ఇప్పుడు



తెలుసుకుందాం..

### 1. సిట్రస్ పండ్లు

అరటిపండు తియ్యగా ఉంటుంది. అరటిపండ్లతో కలిపి పుల్లని పండ్లను అస్సలు తినకూడదు. చాలా మంది అరటిపండు, నారింజ, స్ట్రాబెర్రీ, ఆపిల్, ద్రాక్ష వంటి అన్ని పండ్లను కలిపి తింటారు. అయితే, తీపి, పుల్లని పండ్లను కలిపి తినడం వల్ల జీర్ణవ్యవస్థకు అంతరాయం కలుగుతుంది. ఆయుర్వేదం ప్రకారం, అరటిపండ్లతో పుల్లని పండ్లను తినడం వల్ల వాత, పిత్త, కఫ అసమతుల్యత ఏర్పడుతుంది. ఇది అనేక రకాల ఆరోగ్య సమస్యలకు కారణమవుతుంది.

### 2. వేయించిన వస్తువులు

చాలా మంది అతిగా తినడానికి ఇష్టపడతారు. వారు ఏదో ఒకటి తింటూనే ఉంటారు. మీరు అరటిపండు తిన్నట్లయితే, దాని తర్వాత వెంటనే వేయించిన ఆహారాన్ని తినడం మంచిది కాదు. అరటిపండ్లతో వేయించిన ఆహారాన్ని తినడం మానుకోవాలి. లేకపోతే, గ్యాస్, అజీర్ణం, మలబద్ధకం వంటి సమస్యలు వస్తాయి. కొంతమందికి ఉబ్బరం, తిమ్మిరి, కడుపు నొప్పి కూడా రావచ్చు.



# పాకిస్తాన్ జిందాబాద్ అన్నాడు..

పహల్గాంలో ఉగ్రదాడి ఘటనతో దేశం మొత్తం ఆగ్రహావేశాలతో అట్టుడుకుతోంది. ఎక్కడ పాకిస్తాన్ అనే మాట వినిపించినా భరించలేని పరిస్థితుల్లో ఉన్నారు. ఇలాంటి ఉద్రిక్త పరిస్థితుల మధ్య ఓ వ్యక్తి పాకిస్తాన్ జిందాబాద్ అంటూ నినాదాలు చేశాడు. చివరకు ఏం జరిగిందంటే..

చంపేశారు..పహల్గాంలో ఉగ్రదాడి ఘటనతో దేశం మొత్తం ఆగ్రహావేశాలతో అట్టుడుకుతోంది. ఎక్కడ పాకిస్తాన్ అనే మాట వినిపించినా భరించలేని పరిస్థితుల్లో ఉన్నారు. ఇలాంటి ఉద్రిక్త పరిస్థితుల మధ్య ఓ వ్యక్తి పాకిస్తాన్ జిందాబాద్ అంటూ నినాదాలు చేశాడు. ఆ మరుక్షణమే అంతా కలిసి అతన్ని కొట్టి చంపేశారు. కర్నాటకలో జరిగిన ఈ విషాద ఘటనకు సంబంధించిన వివరాల్లోకి వెళితే..

%గూాసవజవతీఅంవవఎవత్‌కర్ణాటక మంగళూరులోని కుడుపు ప్రాంతంలో ఈ ఘటన చోటు చేసుకుంది. స్థానిక భత్రా కల్లుర్తి ఆలయ సమీపంలో ఆదివారం క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ టోర్నమెంట్‌లో మొత్తం 10 జట్లు పాల్గొన్నాయి. సుమారు 100 మందికి పైగా మ్యాచ్ ఆడేందుకు వచ్చారు. ఈ టోర్నమెంట్‌ను చూసేందుకు చాలా మంది క్రికెట్ అభిమానులు తరలివచ్చారు. అయితే మ్యాచ్ జరుగుతుండగా.. మధ్యాహ్న సమయంలో షాకింగ్ ఘటన చోటు చేసుకుంది.

# వరుణ్ తేజ్..మేర్లపాక కాంబోలో మూవీ



బ్యాక్ టు బ్యాక్ డిజాస్టర్స్ తో డౌన్ ఫాల్ లో ఉన్నాడు మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్. ఎన్నో ఆశలు పెట్టుకున్న మట్కా మొదటి ఆటకే మకాం సర్దేసింది. దీంతో కాస్త గ్యాప్ తీసుకుని కథలపై దృష్టి పెట్టిన ఈ మెగా హీరో యంగ్ డైరెక్టర్ మేర్లపాక గాంధీ డైరెక్షన్ లో సినిమా చేసేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడు. ఈ సినిమాను యూవీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి.మేర్లపాక గాంధీ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాకు కొరియన్ కనకరాజ్ అనే క్రేజీ టైటిల్ ఫిక్స్ చేసినట్టు సమాచారం. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్ లోని ఆచార్య సెట్ లో జరుగుతుంది. సినిమాలో వచ్చే ఐటమ్ సాంగ్ కోసం అక్కడ నిర్మించిన ప్రత్యేక సెట్స్ లో సాంగ్ షూట్ చేస్తున్నారు. ఈ కోసం హాట్ బ్యూటీని రంగంలోకి దింపుతున్నారు. హుషారు, బంగార్రాజు వంటి సినిమాలలో మెప్పించిన దక్ష నాగర్కర్ కొరియన్ కనకరాజ్ లో వరుణ్ తేజ్ తో కలిసి ఆడిపాడనుంది. లాంగ్ గ్యాప్ తర్వాత వస్తున్న వరుణ్ తేజ్ ఈ సినిమాతో స్ట్రాంగ్ కంబ్యాక్ ఇవ్వలని భావిస్తున్నాడు. ఈ సినిమా కోసం వరుణ్ తేజ్ తైక్వాండో లో ప్రత్యేక శిక్షణ తీసుకుంటున్నాడు. వరుణ్ తేజ్ కెరీర్ లో 15వ సినిమాగా వస్తున్న ఈ సినిమాకు థమన్ సంగీతం అందిస్తున్నాడు. మరి వరుణ్ ఆశను మేర్లపాక గాంధీ నెరవేరుస్తాడో లేదో రానున్న రోజుల్లో తెలుస్తుంది.



అది నకిలీదంటూ టీమ్ స్పష్టీకరణ

బాలీవుడ్ మిస్టర్ ఫర్‌ఫెక్ట్ అమీర్ ఖాన్.. సిక్కు మతస్థుల దైవం అయిన గురునానక్ బయోపిక్ చేస్తున్నట్లు అతడి రూపంలో ఉన్న ఒక పోస్టర్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.. తాజాగా ఈ వార్తలపై అమీర్ ఖాన్ టీమ్ స్పందించింది. ఆ పోస్టర్ పూర్తిగా నకిలీదని, అది కృత్రిమ మేధస్సు ద్వారా సృష్టించిన పోస్టరని టీమ్ చెప్పుకోచ్చింది. ఈ విషయంపై అమీర్ ఖాన్ టీం స్పందిస్తూ.. గురునానక్‌గా అమీర్ ఖాన్‌ను చూపిస్తున్న పోస్టర్ పూర్తిగా నకిలీది. దానిని ఎఐ ద్వారా తయారు చేశారు. అమీర్ ఖాన్‌కు అలాంటి ప్రాజెక్ట్‌తో ఎలాంటి సంబంధం లేదు. ఆయన గురునానక్‌ను ఎంతో గౌరవిస్తారు. ఎలాంటి అగౌరవకరమైన చర్యలకు ఆయన మద్దతు ఇవ్వరు. దయచేసి ఇలాంటి నకిలీ వార్తలను నమ్మవద్దని పేర్కొన్నారు.

ఈ పోస్టర్‌ను ఒక నకిలీ యూట్యూబ్ ఛానెల్ ద్వారా వ్యాప్తి చేయడంతో సిక్కు సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఈ ఘటనపై శిరోమణి గురుద్వారా ప్రబంధక్ కమిటీకి కూడా ఫిర్యాదు అందింది. ఇది మత సామరస్యాన్ని దెబ్బతీసేందుకు జరిగిన ఉద్దేశపూర్వక ప్రయత్నంగా ఉందని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. అంతేకాకుండా, అమీర్ ఖాన్ ప్రొడక్షన్స్ ఈ మోసాన్ని వెంటనే బహిరంగంగా ఖండించాలని, తమకు దీనితో ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేయాలని డిమాండ్ చేసింది.

## గురునానక్ పాత్రలో అమీర్ ఖాన్ పోస్టర్




# హిట్-3తో వస్తున్న నాని

హ్యాట్రిక్ హిట్స్‌తో మంచి జోష్ మీదున్నాడు నాని. దసరా, సరిపోదా శనివారంతో హండ్రెడ్ క్రోర్ హీరోగా ఛేంజయిన న్యాచురల్ స్టార్ నుండి వస్తోన్న చిత్రం హిట్ 3. ఇప్పటి వరకు నాని కెరీర్‌లోనే మోస్ట్ వయొలెంట్ పిక్చర్‌గా రాబోతుంది. మే 1న థియేటర్లలోకి వచ్చేస్తున్నాడు అర్జున్ సర్కార్. ఇప్పటి వరకు ఈ సిరీస్ నుండి వచ్చిన టూఫిల్మ్స్ మంచి హిట్ కొట్టడంతో పాటు నాని హీరో కావడంతో హిట్ 3పై భారీ అంచనాలున్నాయి. అయితే హిట్ 3కి టఫ్ కాంపిటీషన్ ఇచ్చేందుకు హాలీవుడ్ తో పాటు కోలీవుడ్ చిత్రాలు వచ్చేస్తున్నాయి. సంక్రాంతి సీజన్ తర్వాత ఇప్పటి వరకు డ్రై సీజన్ నడిచింది. కొన్ని అడపా దడపా చిత్రాలు కొన్ని డబ్బింగ్ మూవీస్ సందడి చేశాయి. ఏప్రిల్ మొత్తం బాక్సాఫీస్ డల్ అయ్యింది. ఇప్పుడు మేలో వచ్చే సినిమాలపైనే హోప్స్. మేడేన వచ్చేస్తున్నాడు నాని. ఇదే సినిమాను పాన్ ఇండియా భాషల్లో డబ్ చేసి రిలీజ్ చేస్తున్నారు. అయితే సౌత్, నార్త్ బెల్టుల్లో హిట్ 3తో కొన్ని సినిమాలు పోటీపడుతున్నాయి.

## వర్ష బొల్లమ్మ.. షవర్ ముందు ఫోజులతో

జిహ్వాకో రుచి.. పుర్రెకో బుద్ధి అంటారు.. కొందరిని చూస్తే అదే అనిపిస్తుంది. కొందరు ఎప్పటికప్పుడు తమకు తోచిన పనిచేస్తూ తెగ వైరల్ అయిపోతుంటారు. తాజాగా టాలీవుడ్ బ్యూటీ చేసిన ఓ చిలిపి పని అలాగే వార్తల్లోకెక్కింది.

సోషల్ మీడియా జోరు పెరిగాక సెలబ్రిటీలు చేసే ప్రతి పని చర్చనీయాంశం అవుతోంది. కొన్ని అనుకోకుండా వైరల్ అయితే..



మరికొందరు తామే తమ సృజనాత్మకతను, ప్రతిభను ప్రదర్శిస్తూ ఫాలోవర్స్‌ను ఆకర్షించే ప్రయత్నం చేస్తూంటారు. ఇందుకోసం కొందరు విచిత్ర చేష్టలతో దృష్టిని తమవైపు తిప్పుకోవాలని చూస్తే, కొంతమంది హీరోయిన్లు తమ టైమింగ్, విట్‌తో అందరినీ అలరిస్తారు. అలాంటి వారిలో హీరోయిన్ వర్ష బొల్లమ్మ ముందు ఉంటుంది. ఈ చిన్నదాని పోస్ట్‌లు, క్యాప్షన్‌లు, కామెడీ డైలాగులు నెటిజన్లను కడుపుబ్బా నవ్విస్తుంటాయి. తాజాగా మరోసారి ఈ బ్యూటీ పెట్టిన పోస్ట్ వైరల్‌గా మారింది.

ఇటీవల వర్ష బొల్లమ్మ వెకేషన్‌లో ఉన్నట్లు కనిపిస్తూ ఒక ఫన్నీ వీడియో షేర్ చేసింది. ఓ పర్యాటక ప్రదేశంలో సింహం నోటి నుంచి నీరు జాలువారే ఫౌంటెన్ దగ్గర, అది తన షవర్ అన్నట్లు ఫన్నీ పోజులతో స్నానం చేస్తున్నట్లు నటించింది. ఈ వీడియోకు నెటిజన్ల నుంచి కామెంట్స్ వెల్లువెత్తాయి. షాంపూ తీసుకోలేదా..., సబ్బు కళ్లలో పడకుండా చూసుకో!, నీవు డైరెక్టర్ అయి కామెడీ సినిమా తీయాలి! అంటూ డిఫరెంట్ టైప్స్ ఆఫ్ కామెంట్స్ వచ్చాయి. వర్ష ఈ వీడియోకు వర్షవర్ బాతమ్మ అనే క్యాప్షన్ జోడించింది. ఇది చూసి అందరూ నవ్వుల్లో మునిగిపోతున్నారు.

ఇదే కాదు..మొన్నామధ్య కూడా చిన్న దుస్తుల్లో ఫొటోలు పోస్ట్ చేసి, ప్యాంట్ ఎక్కడా? అడగొద్దు! అంటూ క్రికెటర్ రిషబ్ పంత్‌ను ఫన్నీగా ట్యాగ్ చేసి మరోసారి నవ్వించింది.



# ఎన్టీఆర్-నీల్ కాంబినేషన్

## 2026 జూన్ రిలీజ్ అంటూ ప్రకటన

ఎన్టీఆర్-ప్రశాంత్ నీల్ ఈ కాంబినేషన్లో సినిమా అనగానే అంచనాలు ఆకాశాన్నంటాయి. కెజియఫ్, సలార్ సినిమాల తర్వాత ప్రశాంత్ నీల్ చేస్తున్న సినిమా కావడం ఒకటైతే ఇది ఆయన డ్రీమ్ ప్రాజెక్ట్ అవడం టైగర్ ఫ్యాన్స్ ఈ సినిమాపై భారీ అంచనాలు పెట్టుకున్నారు. అత్యంత భారీ బడ్జెట్ పై తెరకెక్కుతున్న ఈ సినిమాలు టాలీవుడ్ టాప్ ప్రొడక్షన్ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ తో పాటు ఎన్టీఆర్ ఆర్ట్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. కన్నడ భామ రుక్మిణి వసంత్ హీరోయిన్ గా నటిస్తుండగా రవి బస్రూర్ సంగీతం అందిస్తున్నారు.కాగా ఈ సినిమాను 2026 సంక్రాంతి కానుకగా రిలీజ్ చేస్తామని పూజా కార్యక్రమాలు నిర్వహించిన రోజు ప్రకటించారు మేకర్స్. కానీ అనుకోని కారణాల కారణంగా షూటింగ్ వాయిదా పడుతూ వస్తుండడం, మధ్యలో వార్ 2కు ఆగస్టులో ప్రమోషన్స్ కోసం డేట్స్ ఇవ్వాల్సి ఉండడం వంటి కారణంగా ఈ సినిమా సంక్రాంతికి రాదు అనే వాదనలు వినిపించాయి. ఆ వాదనలకు తెరదించుతూ న్యూ రిలీజ్ డేట్ ను ప్రకటించారు మేకర్స్. 2026 జూన్ 25న ఎన్టీఆర్ నీల్ సినిమాను రిలీజ్ చేస్తామని అనౌన్స్ చేసారు. అలాగే యంగ్ టైగర్ పుట్టిన రోజు కానుకగా మే 20న న ఎన్టీఆర్, నీల్ సినిమా గ్లిమ్స్ రిలీజ్ చేయనున్నట్టు ప్రకటించారు మేకర్స్. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది.